



www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
24-06-2024

సంపుటి : 01 | సంచిక : 51 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


## సీఎం అంటే కటింగ్ మాస్టరా?

ప్రతి పథకంలో కోత పెట్టడమే లక్ష్యమా?

గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్ పథకంలో అన్యాయం

ఇప్పుడు రుణమాఫీలో కూడా ఎగనామం పెడతారా..?

ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎక్స్ లో రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సీఎం అంటే కటింగ్ మాస్టరా..? అని అన్నారు. ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోత పెట్టడమే లక్ష్యమా అని నిలదీశారు. సీఎం అనే పదానికి ఇదే సరికొత్త నిర్వచనమా? అన్నారు. 'నాడు పరుగు పరుగున

మిగతా2లో...




# కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

## జులై 2న చేసేందుకు రేవంత్ ప్లాన్

ఒకేసారి ఆరుగురు మంత్రులకు చోటు

ఇప్పటికే ఏఐసీసీ వద్ద చర్చలు పూర్తి

కొత్త ఎమ్మెల్యేలకు, సీనియర్లకు చోటు

సామాజిక సమీకరణాలను అనుసరించి విస్తరణ

ఢిల్లీ స్థాయిలో ఆశావహుల లాబీయింగ్

నామినేటెడ్ పదవుల్లోనూ సమూల మార్పులు

రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు దాటింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో ఆశావహులకు పదవులు దక్కలేదు. తెలంగాణ మంత్రి మండలిలో 17 మంది మంత్రులు ఉండాల్సి ఉన్నా.. ప్రస్తుతం 11 మంది మాత్రమే ఉన్నారు. ఇక ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో పాలనపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మంత్రిమండలిని విస్తరించడంతో పాటు కాంగ్రెస్ ఆశావహులకు పదవులు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఏఐసీసీ ఇచ్చే మార్గదర్శకాలను అనుసరించి కేబినెట్ విస్తర్ణకు రేవంత్ సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు కీలకమైన హోం శాఖ, విద్యా శాఖ, మున్సిపల్, కార్మిక శాఖలు సీఎం వద్దనే ఉన్నాయి. వీటిని కొత్తగా కూర్పుచేసే మంత్రి మండలిలో ఇతరులు కేటాయించేలా ప్లాన్ చేసుకుంటున్నారు. జులై 2న కేబినెట్ విస్తరణ ఉంటుందని పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**విశ్వంభర, హైదరాబాద్ :**

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల్లో తలమునకలైన సీఎం, మంత్రుల నియామకాల అంశంపైనా దాదాపు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన నామినేటెడ్ పదవుల్లో కొన్నింటిపై కొందరు మంత్రులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో మార్పులు చేర్పులు చెయ్యాలన్న యోచనతో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ 37 నామినేటెడ్ పదవుల్లో కొన్నింటిని తొలిగించాల్సి వస్తే, వాటి స్థానంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన, చేస్తున్న వారిని చేర్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిగతా2లో...

## రూ.325 కోట్లతో ఎన్‌హెచ్65పై ఫ్లైఓవర్లు

- రూ.30 వేల కోట్లతో హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు
- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 17 బ్లాక్ స్పాట్లను గుర్తించాం
- వారం రోజుల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తాం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటన



2

## నీట్ అవకతవకలపై సీబీఐ

- క్రిమినల్ కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థ
- ఈ ఏడాది నీట్ పేపర్ లీక్ అయినట్టు ఆరోపణలు
- పరీక్షపై దేశవ్యాప్తంగా దుమారం
- నీట్ రద్దు చేయాలని డిమాండ్లు
- కేంద్రం ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీబీఐ

6




## ఆప్యాయ ఆలింగనం..

- మెగాస్టార్‌ను కలిసిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- చిరంజీవి గారు.. నేను మీ సినిమాలకు అభిమానిని..



2

# మినీ ఎడ్యుకేషన్ హబ్స్

### రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌ల ఏర్పాటు

ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు

కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్ట్

సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

భట్టి, సీఎస్‌తో కలిసి నమూనాల పరిశీలన



**విశ్వంభర, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల పాఠశాలలను వేర్వేరు చోట్ల కాకుండా ఒకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్లను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ లను నిర్మించేందుకు సన్నద్ధం అయింది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్,

మిగతా2లో...



## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- కండువ కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- హస్తం పార్టీలోకి క్యూ కడుతున్న గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు

2

## అధికారులూ.. జాగ్రత్త!

- మీ పేర్లు అన్నీ బ్లాక్ బుక్‌లో ఎక్కుతున్నాయ్
- అధికారంలోకి వచ్చాక మీకు బ్లాక్ డేస్ తప్పవు
- ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ పాటించాలి
- ఫ్లై యాష్ స్కాంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు
- పొన్నం డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేయాలి
- మంత్రికి సవాల్ విసిరిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 119 | ₹204 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 141 | ₹233 |

## స్ట్రీట్ ఫైటర్ కావాలా.. రియల్ ఫైటర్ కావాలా?

- కుంభస్థలాన్ని కొట్టే దమ్మున్నోడు కావాలి
- నేను ఐదుగురు ముఖ్యమంత్రులుతో కొట్లాడాను
- బీజేపీ అధ్యక్ష పదవిపై ఎంపీ ఈటల రాజేందర్



**విశ్వంభర, హైదరాబాద్:** ఈటల రాజేందర్ పేరు ఇప్పుడు బీజేపీలో ఎక్కువగా వినిపిస్తోంది. ఎందుకంటే త్వరలోనే ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అవుతాడని అంటున్నారు. మొన్ననే అమిత్ షాను కూడా కలిసి వచ్చిన ఈటల.. ఇప్పుడు తాజాగా రాష్ట్ర అధ్యక్ష పదవిపై సంచలన కామెంట్లు చేశారు. ఈటల రాజేందర్ తాజాగా మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా స్ట్రీట్ ఫైటర్ కావాలా.. రియల్ ఫైటర్ కావాలా.. నేను ఐదుగురు ముఖ్యమంత్రులుతో కొట్లాడాను అంటూ ఆయన చెప్పుకొచ్చారు. సందర్భం వచ్చినప్పుడు కుంభస్థలాన్ని కొట్టే

మిగతా2లో...

## నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల


మే 24 నుంచి జూన్ 3 వరకు సప్లిమెంటరీ పరీక్షలు

జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి

నేటి మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాల విడుదల



2



## నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

- ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయించనున్న రాష్ట్రపతి ముర్ము
- మంత్రుల చేత స్వీకారం చేయించనున్న ప్రొటెం స్పీకర్ భర్తిహరి మహతాబ్
- జూన్ 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం
- జూలై 2న లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగం..
- జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం లేకుండానే సమావేశాలు

9



## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** తెలంగాణ కాంగ్రెస్ లోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి కీలక నేతలంతా కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. ఎన్నికల తర్వాత సైతం బీఆర్ఎస్ నుంచి ప్రముఖ కీలక నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జూబ్లీహిల్స్ తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సంజయ్‌కి కాంగ్రెస్ కండువా కప్పి సంజయ్‌ని పార్టీలోకి ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవలే దానం నాగేందర్, కడియం శ్రీహరి చేరగా మొన్ననే పోచారం శ్రీనివాసరెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం సాగుతోంది. కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్ సైతం కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## సీఎం అంటే కటింగ్ మాస్టరా?

(మొదటి పేజీ తరువాయి)
వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారు. నేడు 2 లక్షల రూపాయల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. మొదలు రూ.39 వేల కోట్లు అని ఇప్పుడు రూ.31 వేల కోట్లకు కటింగ్ పెట్టి కుదించారు. పాసుబుక్కులు లేవనే నెపంతో లక్షల మందికి శఠగోపం పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించం. రేషన్ కార్డు సాకు చూపి లక్షల మందికి మొండిచెయ్యిచ్చే కుతంత్రం చేస్తే భరించం. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొంతమందికి చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఇంకొంతమందికి.. శూన్యహస్తం చూపే చీకటి పన్నాగాన్ని చూస్తూ ఊరుకోం. మొన్న లక్షలాది మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరం చేశారు. నిన్న 200 యూనిట్ల పథకానికి ఆంక్షలు పెట్టి ఆగమాగం చేశారు. నేడు రూ.2 లక్షల రుణమాఫీని కూడా ఎగ్గొట్టి లక్షలాది మంది రైతులకు ఎగనామం పెడతామంటే కుదరదు.. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధుకు ఇప్పటికీ దిక్కులేదు. ఓట్ల పండగ ముగిసినా.. ఎకరానికి రూ.7500ల రైతుభరోసాకు అడ్రస్సే లేదు. కాంగ్రెస్ ప్రచారంలో "అందరికీ అన్నీ" అన్నారు.. అధికారంలోకి రాగానే "కొందరికే కొన్ని" అని కోతపెడుతున్నారు. రుణమాఫీపై మాట తప్పినా... మడమ తిప్పినా... లక్షలాది రైతు కుటుంబాల తరపున ప్రశ్నిస్తాం, పోరాడుతాం" అని చెప్పారు.

## పద్మ శ్రీ అవార్డు గ్రహీత రామచంద్రయ్య కన్నుమూత



**విశ్వంభర, మణుగూరు :** పద్మ శ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య కన్నుమూశారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా అనారోగ్య పరిస్థితి విషమించి ఆదివారం రోజున ఆయన మృతి చెందారు. భద్రద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలంలోని కూనవరం ఆయన స్వగ్రామం. కాగా గ్రామంలోని ఇంటి వద్దనే ఆయన కన్నుమూసినట్టు తెలిపారు బంధువులు. ఆయన గతంలో కంచుమేళం కంచుతాళం వాయిస్తూ ఆదివాసీ తెగల కథలు చెప్పే కళాకారుల్లో అత్యంత చిట్టచివరి వ్యక్తిగా గుర్తింపు పొందారు. దాంతో పాటు సమ్మక్క, సారలమ్మలను చిలకల గుట్ట మీద నుంచి తెచ్చే సమయంలో ఆయన చాలా కీలకంగా వ్యవహరించేవారు. గతంలో ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మ శ్రీ అవార్డును ప్రకటించింది. 2022లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు రామచంద్రయ్య. ఇక ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## నేటి నుంచి సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్:** దిల్‌సుఖ్‌నగర్లో సుప్రసిద్ధమైన వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిచనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక పూజలు చేయదలిచిన వారు ఆలయ సిబ్బందిని సంప్రదించాలని అలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు పల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకాగలరని వారు కోరారు.

# కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

(మొదటి పేజీ తరువాయి)
ఒకట్రెండు రోజుల్లో అది కూడా పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

**ఏఐసీసీ వద్ద కేబినెట్ విస్తరణపై చర్చ**

ఇక మంత్రివర్గ విస్తరణపై కసరత్తు పూర్తి చెయ్యాల్సి ఉంది. ఇప్పటికే అధిష్ఠానం వద్ద కూడా మంత్రివర్గ కూర్పుపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరుగురు మంత్రులను విస్తరణలో భర్తీ చేయాల్సి ఉంది. మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య మాత్రం చాంతాడంత ఉంది. కానీ 6 మంత్రి పదవుల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి, రెండు బీసీలకు, ఒకటి లంబాడీకి, మరొకటి మైనారిటీకి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. కీలకమైన హోం శాఖను బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఢిల్లీ స్థాయిలో ఆశావహుల లాబీయింగ్**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఏఐసీసీ హామీతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు కూడా మంత్రి పదవుల కోసం వేచి చూస్తున్నారు. ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసుకుంటున్నారు. అయితే పోటీ పడుతున్న నలుగురు రెడ్డి సామాజికవర్గ నాయకుల్లో ఇద్దరికి మంత్రి వర్గంలో చోటు దక్కుతుంది. మరో ఇద్దరిలో ఒకరికి డిప్యూటీ స్పీకర్, ఇంకొకరు ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులయ్యే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి



ముదిరాజ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలకు మంత్రి పదవులు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఏదైనా కారణాలతో సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోతే ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

**కీలకంగా మారిన సామాజిక సమీకరణాలు**

ఇక మిగిలిన రెండింటిలో ఒకటి లంబాడి సామాజిక వర్గానికి చెందిన దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్‌కు ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకో మంత్రి పదవి మైనారిటీలకు ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ లేకపోవడంతో ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న ధోరణిలో రాష్ట్ర నాయకత్వం సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. మానకొండూరు ఎమ్మెల్యే మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేస్తూ జులై రెండో తేదీన ముదిరాజ్ శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పడంతో త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనేందుకు దీనిని సాక్ష్యంగా చెప్పుకోవచ్చు.

# ఆప్యాయ ఆలింగనం..

**విశ్వంభర, హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పద్మభూషణ్ మెగా స్టార్ చిరంజీవిని కలిశారు. ఆదివారం జూబ్లిహిల్స్ లోని ఆయన నివాసానికి చేరుకున్న బండి సంజయ్‌ను చిరంజీవి సాదరంగా ఆహ్వానించి తన నివాసానికి తీసుకుని వెళ్లారు. శాలువా కప్పి సత్కరించారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. 'సంజయ్ గారు... మీరు ఎంతో కష్టపడి పైకొచ్చారు. మీరు మంత్రి కావడం చాలా ఆనందంగా ఉంది. మీ అగ్రెసివ్ మెంటాలిటికి తగిన పోస్ట్ లభించింది' అని ఈ సందర్భంగా చిరంజీవి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ తమను దగ్గరకు తీసుకుని పలకరించడం మర్చిపోలేని అనుభూతిగా మిగిలిందని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. ఇక బండి సంజయ్ స్పందిస్తూ 'నేను విద్యార్థి దశలో మీ సినిమాలకు అభిమానిని' అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.



# అధికారులూ.. జాగ్రత్త!

**విశ్వంభర, హుజూరాబాద్ :** అధికారులు ప్రోటోకాల్ పాటించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తాజాగా ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. అధికారులను హెచ్చరిస్తున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నా బ్లాక్ బుక్ లో మీ పేర్లు రాస్తున్న.. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మీకు బ్లాక్ డేస్ ఉంటాయి. 34 నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదు. మాకు తెలియకుండా నియోజకవర్గాల్లో కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కోరుతున్నట్టు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తాడు అని కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ ఆపుతున్నారు. 368 కళ్యాణ లక్ష్మి చెక్కులు హుజూరాబాద్ నియోజకవర్గం కు వచ్చాయి .. అవి ఇవ్వడం లేదు.. ఈ నెల 27 న చెక్కుల తేది అయిపోతుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తే అభ్యంతరం లేదు.. ఎందుకు పొన్నం ప్రభాకర్ భయపడుతున్నారు ? కళ్యాణ లక్ష్మీ లో తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది.. అది అడుగుతామని భయపడుతున్నారా ? అని ప్రశ్నించారు పాడి కౌశిక్ రెడ్డి. బుధవారం 11 గంటలకు జూబ్లి హిల్స్ టిటిడి టెంపెల్ దగ్గరకు రావాలి మంత్రి పొన్నం ప్రభాకర్ రావాలి అని సవాల్ విసురుతున్నా.. ఫ్లై యాష్ స్కాం లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. వేంకటేశ్వర స్వామి ముందు నేను డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేయాలి పొన్నం ప్రభాకర్. పొన్నం ప్రభాకర్ డబ్బులు తీసుకున్నారని నేను ప్రమాణం చేస్తా.. బుధవారం ఫ్లై యాష్ స్కాం లో పొన్నం ప్రభాకర్ మరిన్ని వివరాలు చెబుతానని సంచలన వ్యాఖ్యలు చేశారు కౌశిక్ రెడ్డి.




## రైతుబంధు ఆపడానికి వీలులేదు : జగదీశ్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** రైతులకు పెట్టుబడి సాయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు బంధు సాయాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపడానికి వీలులేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. రైతు భరోసా పేరుతో రైతులకు రూ.15,000 ఇస్తామని మాట తప్పారని ఫైర్ అయ్యారు. రైతు భరోసా స్కీమ్పై క్యాబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేస్తున్నారని, క్యాబినెట్ సబ్ కమిటీ వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. క్యాబినెట్ సబ్ కమిటీ రైతులను మోసం చేయడానికి వేసిన కమిటీ అని అన్నారు. రైతు ఋణమాఫీతో సంబంధం లేకుండా రైతు బంధు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. పింఛన్ల పెంపు గురించి కాంగ్రెస్ ప్రభుత్వం నోరే మెదపడం లేదని, విద్యుత్ బిల్లుల మాఫీ రాష్ట్రంలో అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. యాసంగిలో రైతులకు ఏ విధంగా రైతుబంధు ఇచ్చారో ఇప్పుడు అట్లాగే ఇవ్వండన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూన్ నెలాఖరు లోగా రైతుల ఖాతాల్లో రైతు బంధు వచ్చేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని, పురుషులు, మహిళలు అన్న తేడా లేకుండా రాష్ట్రంలో దాడులు జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో ఇతరుల చేరిక అవసరం లేదు: జీవన్ రెడ్డి



**విశ్వంభర, జగిత్యాల:** కాంగ్రెస్ పార్టీలో ఇతరుల చేరిక అవసరం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాంబ్ పేల్చారు. అసెంబ్లీ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మార్పు వ్యవహారం తెలంగాణ పాలిటిక్స్ లో కాక రేపుతోంది. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కు వీర విధేయుడిలా ఉన్న పోచారం అనూహ్యంగా గులాబీ బాస్ కి షాక్ ఇచ్చారు. పోచారం ఆయన కొడుకు భాస్కర్ రెడ్డితో కలిసి అధికార పార్టీలో జాయిన్ అయ్యారు. దీంతో పోచారంపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు. పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు వివిధ పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నుపోటు పొడిచారని ఫైర్ అవుతున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో ఇతరుల చేరిక అవసరం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాంబ్ పేల్చారు. పోచారం చేరిక అవకాశ వాదం కు నిదర్శనమని.. ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసామన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి చేరికను వ్యతిరేకించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..ఇతర పార్టీల నేతలను చేర్చుకోవద్దని కోరారు.

## నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 4.5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పలు సబ్జెక్టుల్లో ఫెయిలైన వారు, ఇంప్రూవ్ మెంట్ కోసం ప్రయత్నించేవారు ఈ సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఆన్సర్ పేపర్ల మూల్యాంకనం ఇటీవలే పూర్తయింది. ఈ నేపథ్యంలో, ఫలితాల విడుదలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేయనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వెల్లడించారు.

## తెలంగాణలో మినీ ఎడ్యుకేషన్ హబ్స్

(మొదటి పేజీ తరువాయి)
మధిర నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ల నిర్మాణాలు చేపట్టనుంది. ఆ తర్వాత దశల వారీగా అన్ని నియోజకవర్గాల్లో ఈ క్యాంపస్‌లను నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ల నిర్మాణానికి ఆర్కిటెక్చర్స్ రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యా బోధనకు వీలుగా తరగతి గదులతో పాటు, విద్యార్థులకు అన్ని వసతులుండేలా అధునాతన భవనాలు నిర్మించాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలకు అనుగుణంగా నమూనాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు దీటుగా ఈ భవనాలు నిర్మించాలని ఆదేశించారు. దాదాపు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో ఈ సమీకృత గురుకులాల సముదాయం ఏర్పాటు చేయనున్నారు. ఒకే చోట ఈ భవనాలు నిర్మించి మినీ ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థుల ప్రతిభా పాటవాలతో పాటు పోటీ తత్వం పెరుగుతుందని, కుల, మత వివక్ష తొలిగిపోతుందని ప్రభుత్వం సంకల్పించింది. గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా నిర్వహించే వీలుంటుందని భావిస్తోంది.

## బీఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, హైదరాబాద్:** రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నియమించారు. ఆయన ఇటీవలే పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గారి ఆశీస్సులతో రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన విజయం తెలిసిందే. బీసీ వర్గానికి చెందిన ఎంపీ రవిచంద్రను పార్లమెంటరీ పార్టీ ఉప నేతగా నియమించడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు, బీసీలతో పాటు అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంపీ వద్దిరాజు ధన్యవాదాలు తెలిపారు.

## స్ట్రీట్ ఫైటర్ కావాలా.. రియల్ ఫైటర్ కావాలా..?



(మొదటి పేజీ తరువాయి)
దమ్మున్నోడు కావాలని.. గల్లీల్లో కొట్లాడే వాళ్లు కాదని అన్నారు.. ఢిల్లీలో అయినా సరే దమ్ము చూపించే నాయకుడు కావాలన్నారు. అయితే ఆయన మాటల వెనక పెద్ద లోతైన అర్థం ఉన్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే బీజేపీ కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా దేశం, ధర్మం, సమాజం పట్ల అందరినీ కలుపుకుని వెళ్లే నేతను నియమించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ రీసెంట్ గా కామెంట్ చేసిన నేపథ్యంలోనే ఈటల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీ వెళ్లనున్నారు. ఇవాల్టి నుంచి లోక్ సభ సమావేశాలు జరగనుండగా, ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా రేవంత్ రెడ్డి పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అనంతరం ఏఐసీసీ సమావేశాలకు హాజరుకానున్నారు. తెలంగాణ క్యాబినెట్ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపిక తదితర అంశాలపై కాంగ్రెస్ హైకమాండ్ తో రేవంత్ రెడ్డి చర్చిస్తారని తెలుస్తోంది.

# ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు



## నా రాజకీయ జీవితం కాంగ్రెస్‌తోనే ప్రారంభం

**బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**విశ్వంభర, నిజాంసాగర్ :** నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైందని 1977లో అప్పటి ఇందిరా కాంగ్రెస్ హయాంలో ముఖ్యమంత్రిగా వెంగళరావు ఉండగా సొసైటీ చైర్మన్‌గా తాను కాంగ్రెస్ పార్టీ తోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించామని నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే ముగింపు వస్తుందని అనుకుంటున్నానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండలంలో నీటి విడుదల అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా నేను పదవి కోసం స్వలాభం కోసం కాంగ్రెస్ పార్టీలోకి పోలేదని నియోజకవర్గ ప్రజల బాగోగుల కోసం నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు కార్యకర్తల సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లానని అన్నారు. తాను టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెడ్పిటిసిగా ఉన్నారని అప్పటి నుంచే మా ఇద్దరి మధ్యలో స్నేహ పూర్వక సంబంధాలు ఉన్నాయని అన్నారు. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి నాతో మాట్లాడి మీరు పార్టీలోకి వస్తే బాగుంటుందని నా ఇంటికి వచ్చి ఆహ్వానించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిన పనులు పూర్తి కావాల్సిందని పనులన్నింటినీ పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అన్నారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ముందుగా ప్రాధాన్యత ఇద్దామని మనం అందరితో కలిసి పని చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ముందు ఉంచుతూ వారి సలహాలతోనే ముందుకు వెళ్దామని ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ అని భేషజాలకు పోకుండా నియోజకవర్గ అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుదాం అన్నారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతం పలుకుతూ సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**విశ్వంభర, గోదావరిఖని :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రామగుండంను అభివృద్ధి పథంలో తీసుకెళతామని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు రామగుండం అభివృద్ధిని విస్మరించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం రూ.100 కోట్ల ప్రత్యేక నిధులతో రామగుండం కు పూర్వ వైభవం తీసుకువస్తామని అన్నారు. స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు నూతన పరిశ్రమలు నెలకొల్పుతామని ఎమ్మెల్యే తెలిపారు.

గోదావరి నది కలుషితం కాకుండా ఎస్టిపిలను నిర్మిస్తామని, పారిశ్రామిక ప్రాంతంలోని కార్మిక కుటుంబాలకు సురక్షిత మంచి నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది

**రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకుసాగుతోంది : ఆత్రం సుగుణ**



**విశ్వంభర, ఆదిలాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ మాటను నిలబెట్టుకుందనీ కాంగ్రెస్ పార్లమెంటు నాయకురాలు అత్రం సుగుణ అన్నారు. రుణమాఫీ నిర్ణయంతో అన్నదాత ముఖాల్లో ఆనందం నింపుతోందని ఆదివారం ముట్లూరు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఉట్నూర్ మండలం తేజాపూర్ గ్రామంలో రుణమాఫీపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివాసీ, గిరిజన రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. రైతుల పొలాల్లో విత్తనాలు విత్తి..స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ..ఇది నిజంగానే యావత్ తెలంగాణ రైతులకు మంచి శుభ వార్త అని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను ఎప్పుడు తప్పదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తేజాపూర్ గ్రామ పటేల్ గోవింద్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనక సుదర్శన్, కాంబ్లె విశాల్,రాథోడ్ శ్రీకాంత్,మార్లవాయి మాజీ సర్పంచ్ ప్రతిభ, ఆదివాసి రైతులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

- రాబోయే మూడేళ్లలో పాలేరులో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం
- కూసుమంచి మండల సుడిగాలి పర్యటనలో మంత్రి పొంగులేటి



**విశ్వంభర, కూసుమంచి:** పేద,నిరుపేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి ఖమ్మం రూరల్,కూసుమంచి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి గ్రామ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, ఎన్నికల సమయంలో ఏ హామీలను ఇచ్చామో, వాటన్నింటిని విడతల వారిగా నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. పర్యటనలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం కైకొండాయిగూడెం,టిఎన్జిఓస్ కాలనీ,శ్రీ సాయి గణేష్ నగర్, సాయి ప్రభాత్ నగర్, అరేంపుల,కూసుమంచి మండలం ముత్యాలగూడెం, చేగోమ్మ, తురకగూడెం, కూసుమంచి, జుజ్జులరావుపేట, మల్లాయిగూడెం గ్రామాలను సందర్శించారు.ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ కోసం అన్ని సమకూరుస్తున్నామన్నారు. వచ్చే నెల జూలై నుంచి రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. రూ. 31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవాళ్లలో బహు పేదవాళ్లకు ముందు మంజూరు చేస్తామన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామన్నారు. రాబోయే సంవత్సరం లోపు నియోజక వర్గంలోని ప్రతి ఇంటి ముందు సిసి రోడ్లు, డ్రైనేజీలో నిర్మాణం చేస్తామన్నారు. ప్రభుత్వ భూములకు పేదలు హక్కుదార్లని, ప్రభుత్వ భూములు పేదలకు పంచుతామన్నారు. త్వరలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు, ఆసరా పెన్షన్లు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామాల్లో కావాల్సిన పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, మౌలిక సదుపాయాల కల్పన చేస్తామని, త్రాగునీటి సరఫరాకు మెరుగైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రి తన పర్యటనలో నాయుడుపేట గ్రామంలో ఖమ్మం రూరల్ మండలంకు చెందిన కళ్యాణలక్ష్మి పథక 95 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యాంప్రసాద్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, పంచాయతీ రాజ్ ఇఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, ఇరిగేషన్ ఇఇ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచా లకులు విజయ చంద్ర, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**విశ్వంభర, దేవరకద్ర :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రైతు రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రైతులు ,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి కేబినెట్ మంత్రులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలేదని గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ దేశంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేదని తెలిపారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో పదేళ్లు ఉండే డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయకుండా విద్యార్థులను మోసం చేసిందన్నారు. తాము ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని విద్యార్థుల దశాబ్దాల కల నెరవేర్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి,దేవరకద్ర , కౌకుంట్ల మండల అధ్యక్షులు అంజల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి , ఆది హనుమంత్ రెడ్డి, కొండ శ్రీనివాస్ రెడ్డి,వేగనాథ్, విజయ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో తడక రమేశ్ ప్యానెల్ భారీ విజయం

**9 డైరెక్టర్ స్థానాలకు గాను ఆరు స్థానాలు కైవసం**

- ది పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా తడక రమేశ్ ప్రమాణ స్వీకారం
- వైస్ చైర్మన్‌గా భారత రాజేంద్రప్రసాద్ (రాజు)

**విశ్వంభర, భూదాన్ పోచంపల్లి :** ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా తడక రమేశ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు తడక రమేశ్ ప్యానెల్ భారీ ఆధిపత్యాన్ని సాధించి చైర్మన్ పదవిని కైవసం చేసుకొని భారీ మెజారిటీ దక్కించుకుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు జరగగా, 2301 ఓట్లకు గాను 1794 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1653 ఓట్లు గుర్తింపునకు రాగా 141 ఓట్లు రద్దయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించగా.. అర్ధరాత్రి 12 వరకు కొనసాగింది. అయితే తుది ఫలితాలు వెలువడేసరికి తడక రమేశ్ ప్యానెల్ అఖండ మెజారిటీని సాధించుకొని ఆరు మంది అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. మొత్తం తొమ్మిది స్థానాలలో ఆరు జనరల్ స్థానాలు, రెండు మహిళా రిజర్వు స్థానాలు, ఒక ఎస్సీ రిజర్వ్ స్థానాలకు గాను మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లకు జరిగిన ఎన్నికల్లో 27 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. కాగా తడక రమేశ్ 1194 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. అదేవిధంగా మాజీ చైర్మన్ కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం 810 ఓట్లతో విజయం సాధించారు. ఇక మాజీ వైస్ చైర్మన్ సూరపల్లి రమేష్ 680 ఓట్లు సాధించి విజయం సాధించారు. తడక రమేశ్ ప్యానెల్‌లో డైరెక్టర్లుగా పోటీ చేసిన ఏలే హరిశంకర్ 711 ఓట్లతో విజయం సాధించారు. భారత రాజేంద్రప్రసాద్ 682 ఓట్లతో విజయం సాధించారు. రాపోలు వేణు 670 ఓట్లతో విజయం సాధించారు. కొండమడుగు ఎల్ల స్వామి ఎస్సీ రిజర్వు స్థానం నుంచి 1113 ఓట్లతో భారీ విజయం అందుకున్నారు. మహిళా రిజర్వు స్థానాల నుంచి పోటీ చేసిన గుండు కావ్య 1136 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపును సొంతం చేసుకుంది. కర్నాటి భార్గవి 952 ఓట్లతో ఎన్నియ్యారు. వీరికి శనివారం ఉదయం ఎన్నికల అధికారులు గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తమ ప్యానెల్ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఖాతాదారులకు తడక రమేశ్ ధన్యవాదాలు తెలియజేశారు. పోచంపల్లి అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి ఖాతాదారుల సహకారంతో గణనీయమైన మార్పులు తీసుకువస్తూ బ్యాంకును ఆర్థికపరంగా మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. రమేశ్ గెలుపు పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ టపాకులు కాల్చారు.



## జేఈఈ అడ్వాన్స్‌లో 407వ ర్యాంక్‌తో మెరిసిన గిరిజన బిడ్డ

**విశ్వంభర, శంకర్పల్లి :** జేఈఈ అడ్వాన్స్ లో మొకిల తండాకు చెందిన గిరిజన బిడ్డ ఆలిండియాలో 407 వ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. వివరాల్లోకి వెళితే శంకర్పల్లి మండలం మోకిలా తండాకు చెందిన శంకర్, దేవీల కుమారుడు సభావట్ చందు నాయక్ (ఎస్టీ కేటగిరీలో) 407వ ర్యాంక్ సాధించాడు. తండ్రి శంకర్ మేస్త్రి పని చేస్తూ ఎంతో కష్టపడి తన కుమారుడిని చదివించగా ఆల్ ఇండియాలో 407వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. సభావట్ చందు నాయక్ ఐదు నుంచి 10వ తరగతి వరకు గురుకుల పాఠశాల లో విద్యాభ్యాసం చేయగా యూసుఫ్ గూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఇంటర్మీడియట్లో కూడా 9 66 మార్కులు సాధించాడు. ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ చేసి ఉన్నతంగా ఎదగడమే తన ధ్యేయమని చెప్పుకొచ్చారు. తమ కుమారుడు అల్ ఇండియాలో ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



## మియాపూర్ అల్లర్లకు కారణమైన నిందితుల గుర్తింపు

**21 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**విశ్వంభర, శేరిలింగంపల్లి :** మియాపూర్ దీప్తిశ్రీనగర్, ఎంఎ నగర్ హెచ్ ఎండీఏ భూముల ఆక్రమణకు యత్నించడం తో పాటు పోలీసులపై రాళ్లు రువ్విన ఘటనలో బాధ్యులైన 50 మందిని గుర్తించామని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. మియాపూర్ పోలీసు స్టేషన్ లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ నరసింహ్మా రావులతో కలిసి అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గత రెండు మూడు రోజులుగా సుమారు 2,500 మంది జనాలు మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లలో గుమికూడి హెచ్ ఎండీఏ ఆధీనంలోని 450 ఎకరాలలో కబ్జాలకు తెగబడ్డారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్లు విసిరారని, కట్టెలతో దాడులు చేశారని గుర్తు చేశారు. ఈ ఘటనలో పలువురు పోలీసులతో పాటు హెచ్ ఎండీఏ అధికారి రఘు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇదంతా కొందరు వ్యక్తులు కావాలనే చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 50 మంది నిందితులను గుర్తించగా, అందులో 21 మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో 7 మంది మహిళలు కూడా ఉన్నట్టు డీసీపీ వినీత్ తెలిపారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 307, 333, 447, 147, 148, 120బి రెడ్ విత్149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం

## మానసిక ఉద్రేకాల నిగ్రహం అవసరం





నేటి ఔత్సాహిక యువతరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సత మవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణం లోనే చూస్తున్న. ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలి పేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు.

మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. ఐతే కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానిసిక రోగులుగా మారి పోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చి వాళ్ళేననేది నిపుణుల అంచనా అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్ గా వుండేవాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్‌నార్మాలిటీ?! ఎన్ని వింత పోకడలు? తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి పేరుపిచ్చి, సినిమాల పిచ్చి.. గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు, అతి వాగుడు, మితిమీరిన కోపం... వైద్య పరి భాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇసోమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించు కోలేకపోవడమే రుగ్మతను తెచ్చి పెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంత వరకు ఎవరూ మనని తప్పుపట్టారు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభమవుతుంది. మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణమవుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.1). సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం.... కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. 2).అమ్నోసియా... ఇది కూడా సర్వసాధారణంగా కనబడేదే. వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చి పోతుంటారు. 3).ఆస్పర్జెర్స్ సింగ్రోమ్.... వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. 4).మహా ఒత్తిడి... ఈ ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోష కరమైన పండుగలు ఇతరత్రా ఏవి వచ్చినా వాటిని జరుపు కునేందుకు ఆసక్తి చూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మ హత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. 5).ఓసీడీ... ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్... అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వలసిన అవసరం ఉంటుంది. వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. పండుటాకులకూ పసిబిడ్డలకూ పెద్దగా తేడా ఉండదు. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయుం పెరగడంతో వృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతోపాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యా పెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వంద మందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించ వచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. నాడీ సంబంధిత ప్రసరణ వ్యవస్థ (న్యూరో ట్రాన్స్ మిట్టర్స్)...మానసిక రుగ్మతలు మెదడులోని న్యూరో ట్రాన్స్ మిట్టర్స్ అని పిలువ బడే ప్రత్యేక రసాయనాలలో కలిగే అసాధారణమైన సమతుల్యానికి సంబంధం కలిగి ఉంటాయి. మెదడులో ఉండే నాడీ కణాలు ఒకదానితో మరొకటి సంబంధాన్ని నెరపుతూ ఉండడానికి సహకరించు కుంటాయి. ఒకవేళ ఈ రసాయనాలలో సమతౌల్యం లోపించినా లేక అవి సరిగా పనిచేస్తూ ఉండకపోయినా, మెదడులో సంకేతాలు ఒకచోట నుండి మరొకచోటకు సరిగా పంపబడుతూ ఉండవు, మానసిక అనారోగ్య లక్షణాలకు దారి తీస్తాయి. జన్యు శాస్త్రం... కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల మరియు ఇతర అంశాల వల్ల - అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి.

అంటు రోగాలు...మెదడు దెబ్బ తినడానికి మరియు మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగి వుంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఎ.ఎన్.డి.ఎ) గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనేది అబ్సెస్సివ్ కంపల్సివ్ డిజార్డర్ (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితితప్పనిసరి, బలవంత మైన వైకల్యం) మరియు ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. మెదడులో లోపాలు లేక గాయం... మెదడులో లేక మెదడు లోని కొన్ని భాగాలలో లోపాలు కలుగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**




# ప్రభుత్వ పాఠశాలల్లో పంతుళ్ల పిల్లలు ఉన్నారా?

పేదవారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో, పంతుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లోన!

ప్రత్యేక చట్టం తీసుకురావాలి...

ఎన్నిరోజులు బడి బాట కార్యక్రమాలు నిర్వహించినా.. మార్పు వచ్చేనా..

ఆర్భాటలకు పోయి అప్పుల పాలవుతున్న పేదలు

ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న ప్రవేట్ యాజమాన్యాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బడిబాట కార్యక్రమం(662024నుంచి 1962024)వరకు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరడం లేదని, ప్రవేట్ పాఠశాల మోజులో పేదవారు సైతం తమ పిల్లలను అప్పు చేసి మరీ ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ.. ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న పంతుల్ల పిల్లలు ప్రవేట్ పాఠశాలల్లో చదువుకుంటుంటే, పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారు సైతం మా పిల్లలను ఎందుకు ప్రభుత్వ పాఠశాలకు పంపాలని, రోజువారి కూలైన చేసి మా పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదివించాలనే కోరికలతో పేదవారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపకుండా లక్షల రూపాయల ఫీజులను భరించుకుంటూ.. కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం కోసం ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంది. దీనికి తోడు పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు అందించడంతోపాటు ఉచితంగా భోజనం సౌకర్యం కల్పిస్తుంది. అదేవిధంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించడం విశేషం. ఇన్ని సౌకర్యాలు కల్పించిన గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ చిన్నారులను కార్పొరేట్ పాఠశాలలో చేర్పించడానికి మొగ్గు చూపడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

**ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావాలి..**

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే పంతుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, ప్రత్యేక జీవో తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రోత్సహించాలి. కొంత మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలు లేని బడిలో డ్యూటీ చేస్తూ (ప్రవేట్ వ్యాపారాలు)చేస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం యిప్పటికైనా ప్రభుత్వ పాఠశాల పైన ప్రత్యేక దృష్టి సారించి, కార్పొరేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహించకుండా, ప్రభుత్వ పాఠశాలలలో అందరు పిల్లలు సమానమే ప్రభుత్వపాఠశాలలోనే చదువు కోవాలని, ప్రవేట్ పాఠశాల వ్యాపారాన్ని నిలువరించాలి. అందరు ప్రభుత్వ పాఠశాలలో చదువు కుంటేనే ఉద్యోగాలకు అర్హత కల్పిస్తామనే.. ప్రత్యేక జీవో తీసుకు రావాలని పలువురు పేద పిల్లల తల్లిదండ్రులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుకుంటున్నారు.



**- కొంగల సతీష్**
**9177943970**

### వలస జీవితాల మెరుగు కోసం ఐక్యరాజ్య సమితి

# అనుబంధ సంస్థల కృషి

## వాపస్ వచ్చిన వలస కార్మికుల పునరేకీకరణకు చర్యలు



తెలంగాణ లోని కరువు పీడిత ప్రాంతాలు, ఒడిశా లోని తీర ప్రాంతాలలో వాతావరణ మార్పుల పరిస్థితులను తట్టుకునే విధంగా వలసదారులు, దుర్భల కుటుంబాల స్థితిస్థాపకత మెరుగు పరచడం కోసం... ఐక్యరాజ్య సమితి అనుబంధ విభాగాలైన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ (ఎఫ్ఓఏ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) లు మైగ్రేషన్ మల్టీపార్ట్ నర్ ట్రస్ట్ ఫండ్ (ఎంఎంపిటిఎఫ్) మద్దతుతో మూడు సంవత్సరాల కార్యక్రమ ప్రాజెక్టును అమలు చేయాలని సంకల్పించాయి. అనిశ్చిత వర్షపాతం, వరదలు, కరువులు తదితర వాతావరణ కారణాల వలన ప్రజలు తరచుగా వలస వెళ్లాల్సి వస్తున్న విషయంపై ఈ ప్రాజెక్టు దృష్టి సారిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్, నారాయణ్ పేట, నిజామాబాద్, ఆదిలాబాద్ లలో ఏదేని రెండు జిల్లాలను ఇందుకోసం ఎంపిక చేస్తారు. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణల నుంచి ఒక్కొక్క జిల్లాను ఎంపిక చేసే అవకాశం ఉంది. శ్రీలంక, నేపాల్, భారత్ లలో వలసల ప్రాజెక్టులు చేపట్టారు. ఇదివరకే జగిత్యాల, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలలో పైలట్ ప్రాజెక్టును పూర్తి చేశారు.

ఈ నేపథ్యంలో... గల్ఫ్ వలస కార్మికుల హక్కుల సంఘం ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి, ప్రముఖ వలస కార్మిక నాయకురాలు నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్ పర్సన్ డా. సిస్టర్ లిసీ జోసెఫ్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) రిటైర్డ్ అధికారి అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, గల్ఫ్ జెఏసి నాయకులు చెన్నమనేని శ్రీనివాస్ రావు లతో ఎఫ్ఏఓ, ఐఓఎం బృందం ఈనెల 20న హైదరాబాద్ లో సమావేశమై పలు విషయాలను చర్చించింది. ఎఫ్ఏఓ ప్రతినిధి షాలిని బుతాని, ఐఎల్ఓ ప్రతినిధి అమిత్ చౌదరి, ప్రాజెక్ట్ ప్రతినిధులు అంకిత, జగన్ మోహన్ రెడ్డి, హరి లు పాల్గొన్నారు.

బోధన్, ముత్యంపేట లలో చక్కెర కర్మాగారాలు మూతపడటం వలన ఈ ప్రాంత రైతులు, రైతు కూలీలు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఈ చర్చలో పాల్గొన్న చెన్నమనేని శ్రీనివాస రావు అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రవేశ పెట్టిన రైతు బంధు పథకంలో ప్రవాస రైతులకు పెట్టుబడి సాయం చెక్కులు ఇవ్వకపోతే తాను, డా. బిఎం వినోద్ కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసి విజయం సాధించామని మంద భీంరెడ్డి అన్నారు.

కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖలు, క్రిషి విజ్ఞాన కేంద్రాలు, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టాంకాం) లతో కలిసి పనిచేస్తారు. తెలంగాణలో వ్యవసాయ శాఖ, కార్మిక శాఖ ఉన్నతాధికారులు, టాంకాం, స్టెప్కార్ అధికారులతో ఈ బృందం సమావేశమైంది.

కష్టాలతో వలస వెళ్ళే ఒత్తిడిని తగ్గించడానికి, వలస ఫలితాలను మెరుగుపరచడానికి వాతావరణ మార్పులకు గ్రామీణ కుటుంబాల యొక్క స్థితిస్థాపకతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఎఫ్ఓఏ, ఐఓఎం లు సంయుక్తంగా వలసలు, వాతావరణ మార్పు, ఆహార అభద్రతల పరస్పర సంబంధాల సవాళ్లపై పనిచేస్తాయి.

**ఇది మూడు భాగాల వ్యవస్థ ద్వారా సాధించబడుతుంది:**

1) ఒక ఇంట్లో నివసించే కుటుంబం (హౌస్ హోల్డ్) వాతావరణ అనుకూల సామర్థ్యాన్ని బలోపేతం చేయండి

2) సురక్షిత, క్రమబద్ధ వలసలు మరియు వాతావరణతెలివైన (క్లయిమేట్ స్మార్ట్) వ్యవసాయంపై సమాచారానికి ప్రాప్యతను మెరుగుపరచడం.

3) వాతావరణ మార్పు, వలసలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలలో విధాన సమన్వయం మరియు బహుళ రంగాల సహకారాన్ని మెరుగు పరచడం.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు:** వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయంపై స్థానిక సామర్థ్యాలను నిర్మించడం, దానికోసం పెట్టుబడి పెట్టడం, వలస మద్దతు సేవలను బలోపేతం చేయడం, తిరిగి వచ్చిన వారిని సమీకరించడం, పునరేకీకరణ చేయడం వారు పంపిన డబ్బును సక్రమంగా వినియోగించే విధంగా (ఛానెలింగ్) చేయడం, స్థిరమైన జీవనోపాధికి గ్రామీణ యువతకు తోడ్పాటు అందించడం, లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం కృషి చేయడం తదితరాలు.

ఈ ప్రాజెక్టులో వలస కుటుంబాల సభ్యులైన మహిళా రైతులు, యువజన సంఘాలు, చిన్న సన్నకారు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, స్వయం సహాయక బృందాలు, వాపస్ వచ్చిన వలసదారులు ముఖ్య లబ్దిదారులుగా ఉంటారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# క్యాన్సర్ సోకిన చిన్నారికి కోమటిరెడ్డి అభయం



**విశ్వంభర, నల్లగొండ :** నల్గొండలోని శ్రీ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. అయితే అక్కడకు వచ్చిన వారిలో ఒక్కొక్కరిది ఒక్కో బాధ. ఇందులో ఓ పదేళ్ల చిన్నా రి ఘటన అందరినీ కలిచి వేసింది. ఆ చిన్నారికి కేవలం పదేండ్ల వయసులోనే క్యాన్సర్ సోకింది. దాంతో మంత్రి కోమటిరెడ్డి చలించిపోయారు. నల్గొండ పట్టణా నికి చెందిన హరీష్, సరితల కూతురు లిషిత క్యాన్సర్ బారిన పడింది. అతి పేద కుటుంబం అయిన వారికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభయం ఇచ్చారు. చిన్నారిని దగ్గరకు తీసుకు ని ఆప్యాయంగా హత్తుకున్నారు. ఆమెలో ధైర్యం నింపేలా మాట్లాడారు. యువరాజ్ సింగ్ కథను చెప్పి.. క్యాన్సర్‌ను ఎదురించాలని ఆమెలో స్ఫూర్తి నింపారు. దాంతో చిన్నారి కూడా తనకు ఇక భయం లేదు అన్నట్టు రోజూ స్కూల్ కు వెళ్తానని ప్రామిస్ చేసింది. ఇప్పటికే లిషితకు కీమోథెరపీలు రెండు దఫాలుగా అయిపోయాయి. ఇక మంత్రి వెంటనే ఆ చిన్నారికి చికిత్స అందిస్తున్న డాక్టర్ రోహిత్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే రూ.50 వేలు సహాయం అందించారు. రేపు సాయంత్రం మరో రెండు లక్షల సహాయం అందిస్తానని మాటిచ్చాడు. దాంతో ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మంత్రి చొరవపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పారిస్ ఒలంపిక్స్‌లో సత్తా చాటాలి

**మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



**విశ్వంభర, హైదరాబాద్ :** అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీ స్టేడియంలో ఒలంపిక్ రన్‌ను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌లు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి 9 కూడళ్ల నుంచి వచ్చిన ఒలింపిక్ క్రీడాజ్యోతి లకు, క్రీడాకారులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మహేష్ కుమార్ గౌడ్ లు క్రీడాకారులకు ఒలింపిక్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారతదేశ క్రీడాకారులు తమ సత్తా చాటి దేశ కీర్తి ప్రతిష్టలను పెంచాలని, తెలంగాణ నుంచి బరిలోకి దిగుతున్న ప్లేయర్లు నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ, ఈషా సింగ్‌లు కూడా పతకాలు సాధించాలని అకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం నాయకులు చాముండేశ్వరి నాథ్, మాజీ కోశాధికారి మహేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి పరీక్షా శిబిరం

**విశ్వంభర, హైదరాబాద్ :** మీర్ పేట్, న్యూ నంది హిల్స్ కాలనీలో శ్రీ నేత్రాలయ ఐ హాస్పిటల్, సంతోష్ నగర్ వారి నేతృత్వంలో లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ మరియు కాలనీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించినారు. ఈ కంటి శిబిరాన్ని లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లైన్ బుచ్చయ్య కాలనీ పెద్దలతో కలిసి ప్రారంభించారు. 200 మంది ఈ శిబిరంలో ఉచిత పరీక్షలు చేయించుకున్నారు.

# మామతో కలిసి భర్తనే చంపేసిన భార్య



**విశ్వంభర, కామారెడ్డి :** కట్టుకున్న భర్తలనే ఈ నడుమ కొందరు కసాయి భార్యలు కడతేరుస్తున్నారు. ఇప్పుడు కూడా కామారెడ్డి జిల్లాలో ఇలాంటి ఘోరమే వెలుగు చూసింది. జిల్లాలోని బాన్సువాడ మండలం తిర్మలాపూ-ర్‌లో రాములు అనే వ్యక్తికి మంజులతో పెళ్లి అయింది. అయితే ఏమైందో తెలియదు గానీ.. రాములు తండ్రి నారాయణతో కలిసి భార్య మంజుల అతన్ని చంపేసింది. కట్టుకున్న భర్తను మంజుల, నారాయణ నరికి మరీ చంపేశారు. ఆ తర్వాత ఇంటి పక్కనే ఉన్న పాడుబడ్డ ఇంటిలోని నీటిట్యాంకులో పడేశారు. దుర్వాసన వస్తోంద ని ఆ ఇంటి ముందే గొయ్యి తీసి పాతిపెట్టారు. ఏమీ ఎరగనట్టు పోలీసులకు తన భర్త కనిపించట్లేదని ఫిర్యాదు చేసింది. కాగా ఆ శవం దుర్వాసన రావడంతో గ్రామ-స్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అనుమానం వచ్చిన పోలీసులు భార్యనే నిందితురాలిగా తేల్చారు. కుళ్లిన స్థితిలో రాములు మృతదేహాన్ని బయలకు తీశారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపుతోంది. ఇక మంజుల, రానాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# హుక్కా నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్టు

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔషపూర్ ది కాంటినెంట్ ఫామ్ హౌస్‌లో బర్త్డే పార్టీలో హుక్కా నిర్వహిస్తున్న ఇద్దరిని ఆదివారం ఘట్కేసర్ పోలీస్లు అరెస్ట్ చేశారు. స్థానికుల సమాచారంతో దాడి చేసి హుక్కా పాత్రలు 14, హుక్కా పైపులు 14, బొగ్గు ప్యాకెట్లు 40, ఒక హీటర్, ఆరు ఫ్లైవర్లు 40 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, సౌరబ్ గుప్త, నాగరాజు అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మేనేజర్ సరోజ్, ఓనర్ ఆకాష్ గుప్తా ఇద్దరూ పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరు.



## ఘనంగా సంజీవ్ నాయక్ జన్మదిన వేడుకలు

**విశ్వంభర చివ్వెంల :** సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, చివ్వెంల జడ్పీటీసీ భూక్య సంజీవ్ నాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం రాంకోటి తండాలోని చార్లెట్ హోమ్ అనాథ పిల్లల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానోత్ తరుణ్ నాయక్, మనోజ్ నాయక్, సుమన్ నాయక్, సుమన్, హరీష్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించిన మధుయాష్కి గౌడ్



**విశ్వంభర, చొప్పదండి :** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. సత్యం సతీమణి రూపాదేవి మూడు రోజుల కిందట మరణించిన నేపథ్యంలో.. ఆయన్ను మధుయాష్కిగౌడ్ ఓదార్చారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

# రూ.325 కోట్లతో ఎన్‌హెచ్-65పై ఫ్లైఓవర్లు

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**విశ్వంభర, నల్లగొండ :** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై 17 బ్లాక్ స్పాట్లను గుర్తించామని 325 కోట్లతో పనులు చేపడుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో హైదరాబాద్ విజ యవాడ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న నాలుగున్నర సంవత్సరాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పేదలకు ఇండ్లతో పాటు, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల రుణమాఫీని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వారం రోజుల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. సొంత స్థలం ఉంటే తక్షణమే ఇల్లు ఇస్తామని, లేని వారికి ప్రభుత్వ స్థలం ఉన్నచోట ఇళ్లు కట్టించి ఇస్తామని తెలిపారు. 30 వేల కోట్లతో హైదరాబాద్ రీజ నల్ రింగ్ రోడ్డు పనులు చేపట్టనున్నామని, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారితో పాటు, ఇతర ఆర్ అండ్ బీ రోడ్లకు రూ.16000 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే చిట్యాలలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుకేందర్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చిన్న వెంకటరెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పోలీసులపై దాడి..

## మియాపూర్‌లో 144 సెక్షన్ అమలు

**విశ్వంభర, మియాపూర్ :** మియాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. నేటి నుంచి 29వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. 144 సెక్షన్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ అవినాష్ మహంతి హెచ్చరించారు. మియాపూర్ హెచ్ఎండీఏ వివాదాస్పద ల్యాండ్‌లో పోలీసులు డ్రోన్‌తో గస్తీ కాస్తున్నారు. కాగా, మియాపూర్ ప్రభుత్వ భూములపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. సంగీత, సీత అనే మహిళ ఇతర మహిళలను ఉసిగొల్పి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు యత్నించి స్థానిక ఫంక్షన్ హాల్స్‌లో మీటింగ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. కాగా, మొత్తం పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంగీత, సీత, సంతోష్‌తో పాటు మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# నిర్దిష్ట ప్రణాళికలతో డివిజన్ అభివృద్ధికి పెద్దపీట

**డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్ :** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలో పలు సమస్యలపై డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వివిధ కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శివ గంగ కాలనీ, వీరన్న గుట్ట శిరిడి సాయి నగర్ కాలనీ, వరద నగర్, ఆర్టీసీ కాలనీ నుంచి భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పనులు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ వేగంగా జరుగుతున్న ట్రంక్ లైన్ పనులను కాలనీవాసులు తన సొంత పనుల్లాగా భావిస్తూ ప్రతిక్షణం పర్యవేక్షిస్తున్నందుకు అభినందనలు తెలియజేస్తూ లెవెల్ సరైన విధంగా నిర్మించి ఎలాంటి ఇబ్బందులు తల్లితకుండా పనులను పూర్తి చేయాలని గుతందారులకు మరియు సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యుల శ్రీశైలం,నరేష్,బాబు రావు, శ్రీధర్ రెడ్డి,నర్సింహా యాదవ్, కోటయ్య,సత్యం, నరేంద్ర కుమార్, చిన్న యాదవ్, బాలాజీ బీజేపీ నాయకులు శ్రీధర్ గౌడ్, కడారి యాదగిరి, రమేష్ చారి,సాయి రామ్ గౌడ్, జయ తేజ, మాధవి,యాదగిరి గౌడ్,రవి తేజ,నాగేంద్ర చారి మరయు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లై యాష్‌పై నిరాధార ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఫ్లై యాష్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారి పై చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, టీ న్యూస్ ఛానెల్, టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినపల్లి సంతోష్ కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక, పార్టీ చీఫ్ ఎడిటర్ తిగుళ్ళ కృష్ణమూర్తి , తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్లకి అడ్వకేట్ ఈటోరు పూర్ణచందర్ రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుంది. అది వినియోగించుకోవడానికి వీలుండదు. దీనిని టెండర్ల ప్రక్రియ ద్వారా ఉచితంగా సప్లై చేస్తారు. ఈ ఫ్లై యాష్‌ను రోడ్ల నిర్మాణానికి ,బ్రిక్స్ తయారీ కి ఉపయోగిస్తారు. ఈ ఫ్లై యాష్ రామగుండం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తుంది. ఈ లారీలలో ఎంత ఫ్లై యష్ పోతుంది అనేది అన్లోడ్ ఎన్టీపీసీ మాత్రమే చూసుకుంటుంది. ఫ్లై యాష్ ఎక్కడ లోడింగ్ అవుతుందో అక్కడ అడగల్సింది పోయి హుజురాబాద్‌లో కౌశిక్ లారీలను ఆపి మంత్రి గారిపై ఆరోపణలు చేశారు. కానీ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆ లారీల్లో ఓవర్ లోడ్‌తో వెళ్తుందని ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ గారి పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారు. ఫ్లై యాష్ అనేది రోజుకు వేల మెట్రిక్ టన్నులు వెళ్తుంటాయి. అది అధికారులు చూసుకుంటారు. అది పంపిస్తున్న ఎన్టీపీసీ చూసుకుంటుంది. అది టెండర్ ద్వారా ఎవరైతే తీసుకుంటున్నారో వాళ్ళు చూసుకుంటారు. కానీ వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్ పై చేసిన ఆరోపణలకు గానూ అడ్వకేట్ పూర్ణచందర్ రావు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కి లీగల్ నోటిసులు జారీ చేశారు. అది ప్రసారం చేసిన టీ న్యూస్ ఛానెల్‌తో పాటు నమస్తే తెలంగాణ దిన పత్రిక కు కూడా ఈ లీగల్ నోటిసులు పంపించారు.

# శృంగేరి కాలనీ అసోసియేషన్ సమావేశం

**విశ్వంభర, కొత్తపేట :** కొత్తపేట డివిజన్ శృంగేరి కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ శ్రీ నాయికోటి పవన్ కుమార్ పాల్గొన్నా. అనంతరం నూతన కాలనీ కమిటీ ఏర్పడిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాలనీలో వున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, కాలనీలో డ్రైనేజీ లైన్ నిండి పొంగుతున్నాయని విది దీపాల కొరత, తాగు నీటి సరఫరా సరిగ్గా రావడం లేదని, మరియు విది కుక్కలు లాంటి సమస్యలపైన కార్పొరేటర్ పవన్ కుమార్ గారికి వినతి పత్రాన్ని అందజేసారు. వారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాలనీ అధ్యక్షుడు సుబ్బారావు, అశోక్, రవికుమార్, ప్రహ్లాద్, ఇతర కాలనీ మెంబర్లు పాల్గొన్నారు.




## 'నీట్' అవకతవకలపై క్రిమినల్ కేసు
# నమోదు చేసిన సీబీఐ

**విశ్వంభర, ఢిల్లీ :** నీట్ యూజీ ఎంట్రన్స్-2024 పరీక్ష పేపరు లీక్ అయినట్టు ఆరోపణలు రావడంతో దేశవ్యాప్తంగా దుమారం రేగింది. జాతీయ స్థాయిలో వైద్య విద్య ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ లోనే ఇలాంటి అక్రమాలు జరగడం ఏంటని కేంద్రంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షకు ఒక్క రోజు ముందు పేపర్ లీకైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నీట్ రద్దు చేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో, నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. నీట్ లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ వస్తున్న ఆరోపణల్లో నిగ్గు తేల్చేందుకు సీబీఐ రంగంలోకి దిగింది. నీట్ అవకతవకలపై నేడు కేసు నమోదు చేసింది. కేంద్ర ఉన్నత విద్యా శాఖ, విద్యా మంత్రిత్వ శాఖల లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు సీబీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఫిర్యాదిదారులు పేర్కొన్న ఆరోపణలను ఎఫ్ఐఆర్ లో పొందుపరిచామని, వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తామని వివరించింది. "నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 2024 మే 5న దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష నిర్వహించింది. 571 నగరాల్లో 4,750 కేంద్రాల్లో నీట్ పరీక్ష చేపట్టారు. విదేశాల్లోని 14 నగరాల్లోనూ నీట్ పరీక్ష జరిగింది. నీట్ పరీక్షకు ఈ ఏడాది 23 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. నీట్ పరీక్ష సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో పలు సంఘటనలు జరిగినట్టు మాకు ఫిర్యాదు అందింది. ఈ అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్ర విద్యాశాఖ మమ్మల్ని కోరింది. కుట్ర, మోసం, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం, అవిశ్వాసం... కొందరు విద్యార్థులు, విద్యాసంస్థలు ఆధారాలు ధ్వంసం చేయడం, మధ్యవర్తులు... తదితర అక్రమాలపై దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాదు, ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్రపైనా దర్యాప్తు జరపాలని కేంద్రం కోరింది. ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. నీట్ అక్రమాలపై కేసులు నమోదైన పాట్నా, గోధ్రా ప్రాంతాలకు మా బృందాలను పంపిస్తున్నాం" అని సీబీఐ తన ప్రకటనలో వెల్లడించింది.

# ఎన్‌టీఏ చీఫ్ పై వేటు..
## ఆయన స్థానంలో మాజీ ఐఏఎస్ అధికారి



**విశ్వంభర, ఢిల్లీ :** నీట్,నెట్ పరీక్షల నిర్వహణపై దేశ వ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. నీట్, నెట్ పరీక్షల నిర్వహణలో ఫెయిల్ అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛీఫ్ సుబోధ్ కుమార్‌ను ఎన్‌టీఏ డీజీ బాధ్యతల నుంచి తప్పించి కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఎన్‌టీఏ ద్వారా నిర్వహించే పరీక్షలు పారదర్శకంగా సజావుగా సాగాలంటే తీసుకోవాల్సిన చర్యలపై ఇన్ పుట్స్ ఇచ్చేందుకు మాజీ ఇస్రో చీఫ్ కే రాధాకృష్ణన్ అధ్యక్షతన ఏడుగురు సభ్యుల కమిటీని శనివారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నియమించింది. అనంతరం మరోప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ ఛీఫ్ సుబోధ్ కుమార్‌ను తప్పిస్తూ ఆయన స్థానంలో మాజీ ఐఏఎస్ అధికారిని విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రదీప్ కరోలాను నియమించింది. 1985 బ్యాచ్ కర్నాటక క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన కరోలా 2017లో ఎయిరిండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా పనిచేశారు. ఎన్ టీ ఏ చీఫ్ గా ఆయన నియామకాన్ని కేంద్ర కేబినెట్ లోని నియామకాల కమిటీ ఆమోదించిందని కేంద్ర ప్రభుత్వం ఓ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.

## విశ్వసనీయతను కోల్పోతే
# విద్యా వ్యవస్థ కుప్పకూలుతుంది

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్**



**విశ్వంభర, హిమాయత్ నగర్ :** విద్యావ్యవస్థలో పరీక్ష వ్యవస్థ అనేది మూల స్తంభం అని, విశ్వసనీయతను కోల్పోతే మొత్తం విద్యా వ్యవస్థ కుప్పకూలుతుందని అదే సమస్యను ఇప్పుడు విద్యా వ్యవస్థ ఎదుర్కొంటుందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. ఈ మేరకు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ప్రొ. కె. చక్రధరరావు, కార్య నిర్వాహక కార్యదర్శి ప్రొ.కె లక్ష్మీనారాయణలతో కలిసి ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ.. 23 లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ నీట్ పరీక్షకు తయారయ్యారు. కానీ వారి కష్టం బూడిదలో పోసిన పన్నీరు లాగా అయిపోయిందని, జవాబులు రాయని విద్యార్థులకు ఎన్టీఏ అధికారులు మార్కులు ఇచ్చారని.. దాని ఫలితంగా ఎన్నడూ లేని విధంగా 67 మంది విద్యార్థులకు మొదటి ర్యాంకు వచ్చిందని.. ఒకే సెంటర్లో 6 గురికి నూటికి నూరు మార్కులు వచ్చాయని తెలిపారు. ఇన్ని తీవ్రమైన అవకతవకలు జరిగినాయి కాబట్టి నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రీకృత పరీక్షలకు మూల కారణమైన జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించి, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ఒక విద్యా విధానాన్ని తయారు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థి, విద్యార్థినుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని దీనికి ప్రధానమైన కారణం మౌలిక వసతులు, టీచర్ల కొరత ఉందన్నారు. ఇటువంటి కారణాలను అర్థం చేసుకొని ఆగస్టు 15లోగా యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## దేశంలో విద్యావ్యవస్థ నాశనం అయ్యింది: ఖర్గే

**విశ్వంభర, ఢిల్లీ :** నీట్ యూజీ, యూజీసీ నెట్ ప్రశ్నపత్రాల లీకేజీతో ముసురుకున్న వివాదాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ వ్యవహారం పై కాంగ్రెస్ పార్టీ మరోసారి స్పందించింది. సోషల్ మీడియా వేదికగా ఆ పార్టీ అధ్యక్షుడు ఈ వ్యవహా రంపై స్పందిస్తూ కేంద్రంపై ధ్వజమెత్తారు. నీట్‌లో జరిగిన అక్రమాలకు అధికారులను మార్చడం విద్యా వ్యవస్థలోని సమస్యకు పరిష్కారం కాదని ఖర్గే అన్నారు. ఎన్‌టీఏ స్వయం ప్రతిపత్తి గల సంస్థ కానీ.. ప్రస్తుతం అది బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతా లకు అనుగుణంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యాదాద్రికి బారులు తీరిన భక్తజనం



**విశ్వంభర, యాదగిరిగుట్ట :** వారాంతపు సెలవు కావడంతో యాదాద్రికి తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీ స్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ అనంతరం స్వయంభు, ప్రతిష్ట అలంకాలమూర్తులకు నిజాభిషేకం, తులసి దళాలతో అర్చన సాయంత్రం శ్రీ స్వామి అమ్మ వారి సేవలను ప్రధానాలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూ కాంప్లెక్స్ లో దర్శనానికి నిరీక్షించారు. స్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారి కళ్యాణం చేయించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ప్రసాద స్వామివారి ప్రసాద విక్రయశాల వద్ద కూడా భక్తులు బార్లు తీరారు. స్వామి వారి కొండపైన భక్తుల రద్దీ ఉండడంతో వాహనాల ప్రవేశం ప్రతి పది నిమిషాలకు ఒకసారి కార్లను కొండపైకి పంపకుండా ఆపివేశారు. కొండపైన తగినంత పార్కింగ్ సదుపాయం లేనందున ఆపివేస్తున్నామని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే కొండ కింద ఆధ్యాత్మిక వాడోలో అయినా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో వ్రతాలు చేయించుకున్నారు. వివిధ పూజల ద్వారా స్వామివారి నిత్యాదాయం రూ:64,43,032 సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

## కొత్త మండలాల్లో భవనాల నిర్మాణాలను
# త్వరగా చేపట్టాలి

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**విశ్వంభర, హుజూర్ నగర్ :** ఈనెల 19న శంకుస్థాపన చేసిన ఆర్అండ్‌బి రోడ్లన్నీ నాణ్యతతో కూడిన పనులను త్వరగా పూర్తి చేయాలని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి కోదాడ హుజూర్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఆర్అండ్‌బి అధికారులతో సమీక్షించారు. అనంతగిరి నుండి చనుపల్లికి డబుల్ రోడ్డు రూ. 20 కోట్లు, బరఖత్‌గూడెం నుండి కాగితపు రామచంద్ర పురం వరకు డబుల్ రోడ్డు రూ. 20 కోట్లు, నేషనల్ హైవే 9 నుండి మోతె వరకు డబుల్ రోడ్డు రూ. 25కోట్లు, చింతలపాలెం మండలంలోని మల్లారెడ్డి గూడెం నుంచి రేవూరు మీదుగా రామాపురం వరకు డబుల్ రోడ్డు రూ. 20కోట్లు, హుజూర్ నగర్ మండలంలోని అమరవరం నుండి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు రూ. 23 కోట్లు, నేరేడుచర్ల నుంచి దూపాడు వరకు డబుల్ రోడ్డు రూ. 26కోట్లుతో మంజూరైన రోడ్ల పనుల గురించి సమీక్ష సమావేశంలో చర్చించారు. అలాగే కొత్తగా ఏర్పడిన అనంతగిరి, పాలకవీడు, చింతలపాలెం మండలాల్లో ఇటీవల కాలంలో మంజూరు చేయించిన తహశీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ల కార్యాలయ భవనాలను వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ సీఈ మోహన్‌నాయక్, రాజేశ్వర్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



## మావోయిస్టుల వద్ద నకిలీ కరెన్సీ ముద్రణ పరికరాలు
### స్వాధీనం చేసుకున్న పోలీసులు

**విశ్వంభర, భద్రాచలం :** ఛతిస్గడ్ రాష్ట్రం సుక్మాలో నక్సలైట్ల నుంచి తొలిసారిగా నకిలీ కరెన్సీ ప్రింటింగ్ పరికరాలు దొరికాయి. 50,100, 200, 500 నకిలీ నోట్ల ప్రింటింగ్ నమూనాలు దొరకడంతో పోలీసులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. నిధుల కొరతతో సతమతమవుతున్న నక్సలైట్లు నకిలీ నోట్లను వినియోగిస్తున్నారని సుక్మా ఎస్ పి కిరణ్ చౌహన్ వెల్లడించారు. కొరజ్‌గూడ అడవుల్లో భారీ ఎత్తున మెటీరియల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక మాంద్యం సంబంధించిన విషయం కావడంతో సీరియస్ గా పరిగణించి లోతుగా విచారణ జరుపుతున్నట్లు ఎస్పి పేర్కొన్నారు.

## జగిత్యాల జిల్లాలో దారుణం
### మైనర్ బాలికపై వృద్ధుడి అత్యాచారం

**విశ్వంభర, రాయికల్ :** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లో దారుణం జరిగింది. ఇటీవల పెద్దపల్లి జిల్లాలో మైనర్ బాలిక అత్యాచారం, హత్య ఘటన మరవక ముందే అలాంటి అమానుష ఘటనే మరొకటి చోటుచేసుకుంది. ఏడో తరగతి చదువుతున్న బాలికపై గంగనర్సయ్య అనే వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. వృత్తి రీత్యా టేలర్ అయిన నిందితుడు గంగ నర్సయ్య బాలికకు మాయమాటలు చెప్పి అతని టైలర్ షాప్ లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అత్యాచారానికి గురైనట్లు గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం గా మారగా నిందితుడిని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎకో టూరిజం పేరుతో
# పర్యావరణాన్ని నాశనం చేయొద్దు

**ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ హెచ్చరిక**



**విశ్వంభర, ముషీరాబాద్:** ఎకో టూరిజం పేరుతో కొద్దిమంది మిగిలిన అడవులను నాశనం చేయవద్దని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడవుల్లో ప్రకృతి, పర్యాటక అభివృద్ధి ఆలోచన తక్షణమే మానుకోవాలన్నారు. ప్రకృతికి, వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని పర్యావరణ మంత్రి కొండా సురేఖ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. కౌన్సిల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య, గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి మాట్లాడుతూ దశాబ్దాలుగా జరిగిన అడవుల విధ్వంసంతో ప్రకృతి సమతుల్యత కోల్పోయి, జీవవైవిధ్యం దెబ్బతిన్నదని చెప్పారు. అనేక వాతావరణ సమస్యలు ఎదురవుతున్నా పట్టించుకోకుండా మరింత నష్టం చేసేలా ఎకో టూరిజానికి పూనుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకో టూరిజం పర్యావరణ విధ్వంసానికి కారణం కావద్దని వారు హెచ్చరించారు. టూరిజం పేరుతో అడవుల్లోకి ద్వారాలు తెరిస్తే ఆపడం ప్రభుత్వ తరం కాదన్నారు. అనేక ప్రభుత్వ వ్యవస్థలున్నా మైదాన ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లాంటి వాటి కట్టడి మాటలకే పరిమితం అయ్యిందని, అలాంటిది ఎకో టూరిజం పేరుతో అడవుల్లో జరిగే నష్టాన్ని ఎలా ఆపుతారని వారు ప్రశ్నించారు. ప్రకృతి టూరిజంలో వ్యాపార దృక్పథం మాత్రమే కనిపిస్తుందని, భావితరాలను కాపాడాల్సిన ప్రభుత్వ బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు. అడవుల రక్షణ - పర్యావరణ పరిరక్షణ అనేది భావితరాల మనుగడకు సంబంధించిన విషయం అన్న వాస్తవం ప్రభుత్వం మరువరాదని గుర్తు చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. కానీ పర్యావరణ రక్షణ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం సరికాదని వారు హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం ఎకో టూరిజం ఆలోచన మానుకొని పర్యావరణ పరిరక్షణకు మరిన్ని పటిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి



**విశ్వంభర, చివ్వేంల :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా పాలేరు పర్యటనను ముగించుకుని సాయం త్రం తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ కి వెళ్తున్న క్రమంలో సూర్యాపేట జిల్లాలోని చివ్వేంల మండల కేంద్రంలో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై ప్రమాదవ శాత్తు గుర్తు తెలియని కారు - బైక్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ద్విచక్రంపై ప్రయాణిస్తున్న వాహనదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సమయంలో అదే రోడ్డుపై వస్తున్న మంత్రి పొంగులేటి ప్రమాదాన్ని గమనించి తన కాన్వాయిని ఆపారు. వాహన దారుడు తీవ్ర గాయాలతో ఉండటంతో తన కాన్వాయిలోని ఓ వాహనంలో ఆ క్షతగాత్రున్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ప్రజలు, క్షతగాత్రుని కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.



## హసన్ సెక్స్ స్కాండల్ కేసు..
### ప్రజ్వల్ సోదరుడు సూరజ్ రేవణ్ణ అరెస్ట్

**విశ్వంభర, బెంగళూరు :** పార్లమెంట్ ఎన్నికల సమయంలో కర్ణాటకలో చెలరేగిన హాసన్ సెక్స్ స్కాండల్ వివాదం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఇటీవల అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రేవణ్ణ ఫ్యామిలీలో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. లైంగిక వేధింపుల కేసులో కర్ణాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. సూరజ్‌పై స్వలింగ వేధింపులకు పాల్పడ్డారంటూ ఓ పార్టీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. జూన్ 16వ తేదీ సాయంత్రం సూరజ్ రేవణ్ణ ఫామ్ హౌస్‌లో తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని శనివారం రోజున హూలెనరసిపురా పోలీస్ స్టేషన్‌లో పార్టీ కార్యకర్త ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.. పోలీసులు సూరజ్‌పై ఐపీసీ సెక్షన్ 377, 506(బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ ఆరోపణలను సూరజ్ రేవణ్ణ తీవ్రంగా ఖండించారు. డబ్బుల కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు.




# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రాష్ట్ర సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. ఈనెల 28న సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సహజ యోగ ధ్యానం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీ కృష్ణ మాట్లాడుతూ మాతాజీ నిర్మల దేవి స్థాపించిన సహజ యోగ నేడు సుమారు 170 దేశాల్లో సహజ యోగ ధ్యాన కేంద్రాలను స్థాపించబడ్డాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది కుల మత ప్రాంత వయసుతో సంబంధం లేకుండా సహజ యోగ సాధన చేస్తూ తాము ఎదుర్కొంటున్న శారీరక మానసిక భావోద్వేక సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారని అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతీ మనిషికి సహజ యోగ ద్వారా వచ్చే ప్రశాంతతను ఆనందాన్ని అందించడానికి హైదరాబాద్ రీయలైజేషన్ టూర్‌ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. జూన్ 26 నుంచి 30 వరకు సుమారు 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు దేశాల నుంచి అతిథులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ నాలుగు రోజులు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు సహజ యోగ పరిచయ కార్యక్రమాలు స్ట్రెస్ మేనేజ్మెంట్ సెషన్‌ను వివిధ కళాశాలలో పాఠశాలలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, సభ్యులు సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## చెంచు మహిళపై దాడిని

# హైకోర్టు సుమోటోగా స్వీకరించాలి

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ**



**విశ్వంభర, బషీర్‌బాగ్ :** చెంచు మహిళపై అత్యాచారం, హత్యా యత్నం చేసిన సంఘటనపై రాష్ట్ర హైకోర్టు సుమోటగా స్వీకరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల కొల్లాపూర్ నియోజకవర్గంలోని మొలచింతపల్లిలో జరిగిన ఘటనపై సిట్టింగ్ జడ్జితోగాని, కమిషన్ తోగాని విచారణ జరిపించాలన్నారు. ఆదివారం హైదర్ గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన చెంచు మహిళ ఈశ్వరమ్మపై ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు కలిసి అత్యాచారం చేసి, పెట్రోల్ పోసి దగ్ధం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. అదృష్టవశాత్తు ఒక వ్యక్తి వల్ల ఆమె ప్రమాదం నుంచి బయటపడిందన్నారు. ఆమెతో మాఫియా వెట్టి చాకిరి చేయించున్నదని, దీనికిగాను డబ్బులు అడిగినందుకు మాఫియా ఆమె కాళ్ళు, చేతులు కట్టెసి పచ్చికారం రసాన్ని జననేంద్రియాలతో పాటు, శరీరంపై రుద్ది పెట్రోల్ పోసి చంపడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిసేంతవరకు పోలీసులు, స్థానిక మంత్రి స్పందించక పోవడం దారుణమన్నారు. తాను స్వయంగా డీఎస్పీ, సీఐతో మాట్లాడిన తరువాత శనివారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమెను పరామర్శించడం జరిగిందన్నారు. బాధితురాలికి రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో నాటి చైర్మన్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాల ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారని తక్షణమే ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థులు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫ రాల విషయంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.



# విద్యార్థుల కోసం రాజీనామా కైనా సిద్ధం

**కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్ నాయక్**

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా.. విద్య శాఖకు మంత్రిని కేటాయించకపోవడం దురదృష్టకరమని కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ.. కడ్తాల్లోని కస్తూర్బా పాఠశాలలో అన్ని వసతులు ఉన్నా ఎందుకు ప్రారంభించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఒకవేళ పాఠశాల ప్రారంభానికి ప్రోటోకాల్ పాటించాలనుకుంటే టీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఈ జడ్పీటీసీ పదవి అడ్డంకి అయితే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పాఠశాలలో ప్రవేశం కొరకు విద్యార్థులు వస్తే అధికారులు సీట్లు లేవని ఇంకా పాఠశాల ప్రారంభం కాలేదని సాకులు చెప్పి పంపించడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. పాఠశాలను వెంటనే ప్రారంభించక పోతే విద్యార్థులతో కలిసి ధర్నా, రాస్తారోకో చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ గోపాల్, సర్పంచులు లక్ష్మీ నర్సింహారెడ్డి, తులసి రాం నాయక్, హరిచంద్ నాయక్, శ్వేతాబునాథ్, భారతమ్మ నర్సింహా గౌడ్, భాగ్యమ్మ జంగయ్య, యాదయ్య, సులోచన సాయిలు, సేవ్య నాయక్, వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ స్టేట్ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2024-26ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వేములపల్లి వెంకన్న బాబు, అధ్యక్షుడిగా కోడుమూరు శ్రీనివాస్ (కొత్తగూడెం), ఉపాధ్యక్షులుగా తేరాల ప్రవీణ్ కుమార్ (ఖమ్మం), కటకం వీరేందర్ (తాండూర్), ప్రధాన కార్యదర్శిగా బిక్కుమాండ్ల శ్రీధర్, సహాయ కార్యదర్శిగా ఉదయ్ భాస్కర్ (హైదరాబాద్), కోశాధికారిగా అభిషేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు.

# హత్య కేసులో నిందితుల అరెస్ట్



**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలానికి చెందిన అనంతోజు సాయికిరణ్ (29)కు 2016వ సంవత్సరంలో అనూష తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం బాబు ఆదర్శ్ (6), ఆరాధ్య (3) లు వున్నారు. వీరు గతంలో సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఒక కోళ్ల ఫారంలో కూలీగా పనిచేస్తూ.. అక్కడే కుటుంబంతో ఉంటూ జీవనం సాగిస్తుండేవాడు. అదే ఫారంలో పనిచేస్తున్న భార్యాభర్తలైన బట్టి శ్రీనివాస్ , బట్టి సునీతతో స్నేహం ఏర్పడింది. దానిని ఆసరాగా తీసుకున్న మృతుడు సాయికిరణ్, బట్టి సునీతతో అసభ్యంగా ప్రవర్తించేవాడని దీనికిగాను సాయికిరణ్ బట్టి శ్రీనివాస్ మధ్య గతంలో గొడవ కూడా జరిగిందని అందుకుగాను అక్కడ పని మానేసి మానకొండూరుకు వచ్చి ఒక సామిల్ నందు కూలీగా పనిలో చేరాడు. గత ఏప్రిల్ నెల 18న ఇంట్లో నుంచి పనికని వెళ్లిన భర్త సాయికిరణ్ తిరిగి ఇంటికి రాలేదని మృతుడి భార్య అనంతోజు సునీత 28 మానకొండూరు పోలీసులకు బట్టి సునీత, బట్టి శ్రీనివాస్‌లపై అనుమానం ఉన్నదని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన మానకొండూరు పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. మృతుడు సాయికిరణ్ గతంలో పనిచేసిన సిద్దిపేటలోని పౌల్ట్రీ ఫారం వెల్లాడని, అక్కడున్న బట్టి శ్రీనివాస్ మరియు సునీతతో గొడవకు దిగాడని, వారి మధ్య జరిగిన గొడవలో సాయికిరణ్‌కు గాయమై రక్తస్రావమైందని, ఈ విషయం పౌల్ట్రీ యజమాని మృతుడి భార్య ఆనంతోజు అనూషకు ఫోన్ లో తెలిపాడని తేలింది. గొడవ అనంతరం నిందితులు ఇద్దరు అక్కడినుండి తమ స్వగ్రామం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం బరెగూడ గ్రామానికి వెళ్లిపోయారని తేలింది. అయినప్పటికీ సాయికిరణ్ బట్టి శ్రీనివాస్, బట్టి సునీత లకు ఫోన్ కాల్స్ చేస్తూ వేదించసాగాడని, విసిగిపోయిన దంపతులిద్దరూ సాయికిరణ్ అడ్డు తొలగించుకోవాల నుకుని, పథకం ప్రకారం సునీతచే సాయికిరణ్‌కు ఫోన్ చేసి దహెగాంకు పిలిపించారని, గత ఏప్రిల్ 19న సాయికిరణ్ రాత్రి సమయంలో అక్కడికి చేరుకోగానే ముందే వేసుకున్న పథకం ప్రకారం ఎ1. బట్టి శ్రీనివాస్ (35), ఎ2. బట్టి సునీత (30) , ఎ3. తమ్మిడి గంగారాం (55) , ఎ4. భీమంకర్ శ్యామ్ రావు (50) లు కర్రలతో విచక్షణారహితంగా దాడిచేసి అనంతోజు సాయికిరణ్‌ను హత్య చేసారని, మృతదేహాన్ని అక్కడే చుట్టు పక్కల వున్న పాడుబడిన వ్యవసాయ బావిలోపడేసి మరుసటి రోజు మహారాష్ట్ర కు పారిపోయారని తేలిందన్నారు. దాదాపు రెండు నెలలు శ్రమించి నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసి వారిపై 302, 201, 120-బి , రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి ఆదివారం నలుగురు నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, మేజిస్ట్రేట్ వారికి 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించగా నిందితులను జైలుకు తరలించారు. నిందితులను పట్టుకొనుటకు కృషి చేసిన మానకొండూరు ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ మరియు సిబ్బందిని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ అభినందించారు.

# ప్రజలకు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలి

**డాక్టర్ శ్రవణ్ దాసోజు**

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వ్యాక్యలు "ఏపీతో సమానంగా పని చేస్తాం" అనడం ఆయన అజ్ఞానాన్ని బయటపెడుతోందని డాక్టర్ దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ ప్రతి అభివృద్ధి సూచీలో, ముఖ్యంగా ఆరోగ్య రంగంలో ఎంతో ముందుందన్నారు. అయితే మనకు ఇంకా ప్రభుత్వ రంగంలో బలమైన గ్రామీణ ఆరోగ్య సంరక్షణ అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలను పూర్తిగా అందుబాటులో తేవాలన్నారు. ముఖ్యంగా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల లైసెన్స్ దోపిడీని నియంత్రించకుండా, ప్రస్తుత ముఖ్యమంత్రి వ్యంగ్యంగా, ఆరోగ్య పర్యాటకత పేరుతో మరిన్ని ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించడం కోసం వేల ఎకరాల విలువైన భూమిని కేటాయించడం, కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రమేనని డాక్టర్ శ్రవణ్ దాసోజు ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోరుకునే విశాల దృక్పతం ఉన్న నాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డి మారాలని కోరారు.

# పోరాటాల రాములు

**ప్రొఫెసర్ రత్నం**



**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** బ్రెయిన్ హమరేజ్‌కు గుర్రై హైదరాబాదులో చికిత్స పొందుతూ జులై 14న మృతి చెందిన పట్వారి రాములు సంస్మరణ సభ ఈరోజు ఎక్లాస్పూర్ గ్రామంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే వై రత్నం హాజరై మాట్లాడారు. ఇంకా సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేశ్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవచారి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జీ సరోజన, తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మహదేవ్, చైతన్య మహిళా సంఘం నాయకులు శ్రీదేవి, ఎరుకలి సంఘం నాయకులు పీ నర్సింలు, సాతీరు యాదయ్య, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు వివిధ గ్రామాల ప్రజలు హాజరై నివాళులర్పించి ప్రసంగించారు. ప్రొ.కే వై రత్నం మాట్లాడుతూ.. పేదల భూముల సమస్యలను నీతి నిజాయితీగా నిలబడి పరిష్కరించాడని, పట్వారి రాములు కాదు పోరాట రాములని కొనియాడారు. తన ఉమ్మడి కుటుంబమే కాదు తన చుట్టూ ఉన్న సమాజానికి తన ఊరుకు కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చాడని రాఘవచారి తెలిపారు. తన కుమారుడు (బండారి లక్ష్మయ్య) ప్రజాసంఘాలలో పనిచేస్తున్నందుకు ఇన్ని కష్టాలు వచ్చాయని ఆయన ఎన్నడూ బాధపడలేదని ప్రజల కోసం పనిచేయడం గొప్ప విషయమేనని అనేవాడని ఎస్ఎం ఖలీల్ గుర్తు చేసుకున్నారు. రాజకీయాలు నిజాయితీగా ఉండాలని రాజకీయ నాయకులు ప్రజల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేయాలని అటువంటి నాయకులనే ప్రజలు ఎన్నుకోవాలని ఆకాంక్షించే వారిని ఇంద్రవెల్లి రమేష్ అన్నారు. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని పట్వారి రాములు చివరి కోరికగా ఉండేదని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గురిమిల్ల రాజు అన్నారు. తన ఉమ్మడి కుటుంబంలో చదువులకు నిలయంగా మార్చడానికి అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఉన్నత విద్యలు అభ్యసించేలా కృషి చేశాడని శ్రీదేవి తెలిపారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్

# హుస్సేన్‌నాయక్‌కు ఘన స్వాగతం

**విశ్వంభర, ఆమనగల్లు :** జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్‌కు కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హుస్సేన్ నాయక్ నాగర్ కర్నూల్‌లో జరిగే ఒక సమావేశానికి వెళ్తూ.. మార్గమధ్యంలో మైసిగండి మైసమ్మ ఆలయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగర్ కర్నూల్ బీజేపీ అభ్యర్థి, కల్వకుర్తి జడ్పీటీసీ భరత్ ప్రసాద్ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణ చౌరస్తాలో పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు శాలువాలతో హుస్సేన్ నాయక్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై బీజేపీ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్ కౌన్సిలర్స్ శ్రీకాంత్ సింగ్ గోరటి నరసింహ, శ్రీశైలం యాదవ్, రాములు నాయక్ చెన్నకేశవలు, కృష్ణ నాయక్, విక్రమ్ రెడ్డి, పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, ఆనంద్, జయరాం, నరేందర్ రాథోడ్, రవి నాయక్, గోపి, బాలు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## జయశంకర పాలిమర్స్


# కంపెనీలో అగ్ని ప్రమాదం



**విశ్వంభర, చివ్వెంల :** మండల పరిధిలోని దురాజ్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న జయశంకర్ పాలిమర్స్ లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. షాక్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా ఆ కంపెనీ గోడౌన్ లో మంటలు భారీగా చెలరేగాయి. ఈ మంటల్లో పేపర్ ప్లేట్స్ కి సంబంధించిన వస్తువులు, ముడి సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో రెండు ఫైరింజన్ వాహనాలతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ కంపెనీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ యలగందుల వెంకటేశ్వర్లు కి చెందినది. మంటల్లో కాలి బూడిదైన సరుకుల విలువ సుమారు ఒక కోటి 50 లక్షల రూపాయల వరకు నష్టం జరిగినట్టు వై వెంకటేశ్వర్లు, కుమారుడు యలగందల సిద్ధార్థ, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కనకరత్నం తెలిపారు.

# గీత కార్మికులకు తగిన నిధులు కేటాయించాలి

**• రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్**



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది పేద వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెంది న వారి సంక్షేమం పూర్తి రక్షణ కోసం రాను న్న శాసనసభ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ధర్మభిక్షం భవన్‌లో ఆదివారం బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వన పెంపకం కోసం జీవో 560 ప్రకారం ఇచ్చే ఐదెకరాలకు బదలు 10 ఎకరాలకు పెంచి రాష్ట్రంలోని అన్ని కల్లు గీత సహకార సంఘాలకు, గ్రామాల పునాదిగా టీఎంటీలకు భూమి కేటాయించాలని, హరితహారంలో భాగంగా తాటి, ఈత వనాలు పెంచాలని అ న్నారు. వనరక్షణకు చర్యలు చేపట్టాలని, గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియో రూ. 10 లక్షలకు పెంచడం, తాత్కాలికంగా ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ. 2 లక్షలు, మెడికల్ బోర్డు సర్టిఫికేట్ విధానం రద్దు చేసి, ప్రభుత్వ సర్జన్ సర్టిఫికేట్ విధానాన్ని పునరుద్ధరిం చాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గీత వృత్తిని ఆధునీకరించడం, గ్రామీణ, పట్టణాభి వృద్ధి నిధుల క్రింద నిధులు కేటాయించి గీత కార్మికుల కుటుంబాలకు గృహ, వైద్య, విద్యా ర్థులకు స్కాలర్‌షిఫ్‌లను, వృత్తిదారులకు మోపడులు ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర సం ఘం ప్రధాన కార్యదర్శి డీజీ సాయిల్ గౌడ్ పెండిరగ్‌లో నున్న పెన్షన్‌లు, ఎక్స్‌గ్రేషియోలు చెల్లించాలని అన్నారు. దుస్సరి శ్రీరాములు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియా గీత వృత్తి దారులకు సహకార సంఘాల లైసెన్స్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కోఆర్డినేషన్ కార్యద ర్శి బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ.. వన రక్షణకు కావాల్సిన చర్యలు చేపట్టాలని కోరారు. కేవీఎల్, మారగోని ప్రవీణ్ కుమార్, బొడిగె సైదులు, అంబటి విఠల్ గౌడ్, దొంకిని యాదయ్య గౌడ్, పబ్బు యాదయ్య గౌడ్, చాపల అంజయ్య, నాగేశ్వరరావు, దొంతు రామ్మూర్తి తదితరులు మాట్లాడుతూ నూతన జిల్లాలలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రోడ్ల విస్తరణ తదితర కారణాలతో తాటి, ఈత వనాలు నరికివేస్తున్నందున గీత వృత్తిదా రులు నష్టపోతున్నారని, వన రక్షణకు ప్రభు త్వం చర్యలు చేపట్టాలని కోరారు. గీత వృత్తి దారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు జుల్కై, ఆగస్టు మాసాలలో వివిధ స్థాయిలలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు మెమోరాండాలు ఇవ్వాలని, సభలు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

# ప్రజల్లో కలిసిపోతున్న కలెక్టర్

## ఐఏఎస్ అధికారినన్న అహం లేని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

**విశ్వంభర, ఖమ్మం:** కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌కు వెళ్లినా ఇతర కార్యాలయాల్లో తనిఖీలకు వెళ్లినా ఉన్నతాధికారిననే గర్వాన్ని ఏ మాత్రం ప్రదర్శించడం లేదు. అక్కడున్న సదుపాయాలతోనే అడ్జస్ట్ అవుతూ సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపిస్తున్నారు. కింద కూర్చొనే అక్కడివారితో మాట్లాడి ధైర్యం నింపుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో కూడా ఇదే పద్ధతిని అవలంభించి అక్కడి ప్రజల్లో ఒకరిగా మారిపోయారు. విద్య, వైద్యంపై ప్రధానంగా దృష్టి సారించి అనేక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. కలెక్టరేట్‌లో సైతం సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రతీ ఒక్కరిని కలుస్తూ ఓర్పుగా సమాధానం చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో తన మార్కు పాలనగా అడుగులు వేస్తున్నారు.



### హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన..

ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ పుట్టి పెరిగింది హైదరాబాద్‌లో. పదవ తరగతి వరకు 12 స్కూళ్లలో చదివిన ముజామ్మిల్ 8 నుంచి 10వ తరగతి వరకు మాత్రం నలంద విద్యాలయంలో చదివారు. బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మొదట గూగుల్ లో జాబ్, తర్వాత ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం చేస్తూ మూడవ ప్రయత్నంలో 2017 లో ఐఏఎస్ సాధించారు. తండ్రి ఏకే ఖాన్ ఐపీఎస్ ఆఫీసర్. తెలంగాణ ఏసీబీ, డీజీపీగా పనిచేసి రిటైర్ అయ్యారు. తల్లి సమీరా లా చదివి ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. తాత అబ్దుల్ ఖరీంఖాన్ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్. తాత, తండ్రిని ఆదర్శంగా తీసుకుని సివిల్స్ సాధించిన ముజామ్మిల్ ఖాన్ అకాడమీ శిక్షణలో ఉన్నప్పుడు పరిచయం అయిన కేరళావాసిని వివాహం చేసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రభుత్వం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పోస్టింగ్ ఇచ్చింది. మూడు సంవత్సరాల 9నెలల పాటు పనిచేశారు. తొలిసారిగా పెద్దపల్లి కలెక్టర్‌గా, ఇప్పుడు ఖమ్మం కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని

# ఆమనగల్లు కల్వకుర్తి మధ్యలోనే నిర్మించాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి నియోజకవర్గానికి స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ (వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం) కేటాయించిందని కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల తెలిపారు. దీనికోసం అన్ని మండలాల తహసిల్దార్లతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించారు. యూనివర్సిటీకి అనుకూలంగా ఉండే 100 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసే ప్రక్రియ వేగంగా జరుగుతున్న క్రమంలో ఆమనగల్లు, వెల్దండ మండలాలు కల్వకుర్తి నియోజకవర్గానికి గుండెకాయ లాంటివని యూనివర్సిటీని ఈ ప్రాంతానికే కేటాయించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఓఆర్ఆర్ లోపల ఉన్న భాగం అర్బన్ ప్రాంతమని ఆర్ఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతం సెమీ అర్బన్ ప్రాంతమని విడదీశారు కాబట్టి అర్బన్ సెమీ అర్బన్ ప్రాంతాలు ఇంతకు ముందుకే అభివృద్ధి చెందాయని పేర్కొంటున్నారు. యూనివర్సిటీ అక్కడ కేటాయిస్తే కల్వకుర్తి ప్రాంతానికి న్యాయం జరగదని స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీలో హోటల్ మేనేజ్మెంట్, లాజిస్టిక్ మేనేజ్మెంట్, డాటా అనలిటిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్ కేర్, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్స్, వంటి పెద్ద పెద్ద వృత్తి నైపుణ్య కోర్సులు సెమీ అర్బన్ అర్బన్ ప్రాంతాల్లో చాలా ఉన్నాయని కాబట్టి యూనివర్సిటీకి అనుకూలమైన ప్రాంతం నియోజకవర్గ కేంద్రానికి దగ్గరలో ఉంటే ఈ ప్రాంత విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌కు దగ్గరలో ఉంటే ఇక్కడి విద్యార్థులకు న్యాయం జరగదు కాబట్టి యూనివర్సిటీ కల్వకుర్తి దగ్గరలోనే కేటాయిస్తే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.







## శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా వారి చిత్ర పటానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే షహీద్ చాడ శ్రీధర్ రెడ్డి 30వ వర్ధంతిని స్మరించుకుంటూ.. వారి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు గజరాజ్ కాశినాత్, జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి బండారు సత్యనారాయణ, ఎస్సీ మోర్చ మండల ప్రధాన కార్యదర్శి మధు, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, శెట్టిపల్లి కుమార్, సీనియర్ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.



నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ బొబ్బలి దేవేందర్ ఇటీవలే కంటి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం బొబ్బలి దేవేందర్‌ను పరామర్శిస్తున్న నకిరేకల్ మాజీ శాసన సభ్యుడు చిరుమర్తి లింగయ్య – విశ్వంభర నకిరేకల్



## జడ్పీ నుంచి ఆమనగల్లుకు నిధుల మంజూరు

**విశ్వంభర, ఆమనగల్లు :** జిల్లా పరిషత్ నుంచి ఆమనగల్లు మండలానికి రూ. 16 లక్షలు విడుదలైనట్టు జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి కార్యాలయంలో ఆమనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభివృద్ధి నిధులు రూ. 16లక్షలు పులిగోనిపల్లితండా, సీతారాంనగర్‌తండా, మేడిగడ్డతండాలకు రూ. 5లక్షల చొప్పున సీసీ రోడ్లకు, రానుంతల పెద్దతండా సిసి రోడ్డుకు నాలుగు లక్షలు, కేశ్య తండా శంకర కొండ జీపీకి రెండు లక్షలు మట్టి రోడ్డుకు నిధులు కేటాయించారని వాటి ప్రొసీడింగ్ కాపీలను అమనగల్ జడ్పీటీసీ అనురాధ పత్య నాయక్‌కి అందజేశారు. పెండింగ్ నిధులు కూడా విడుదల చేసి అమనగల్ మండలన్ని అభివృద్ధి చేయాలని ఆమె కోరారు.



## పాల సంఘం చైర్‌పర్సన్‌గా మరియమ్మ ఏకగ్రీవం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల పాల సంఘ నూతన చైర్‌పర్సన్‌గా వస్థుప్పల మరి యమ్మను ఏకగ్రీవముగా ఎన్నుకోవడం జరిగింది. నూతన డైరెక్టర్‌లుగా సోలి పురం సువర్ణ, నాయిని రమలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమములో డైరెక్ట ర్‌లు సోలిపురం అచ్చుమ్మ, సోలిపురం అంజమ్మ, పెసరికాయల జయమ్మ, నాయిని పుష్ప, వంటిపేంటి అంజమ్మ, వంటిపెంటి లక్షమమ్మ, అంబోజు ఆండాలు, బొల్లెపల్లి మహేశ్వరి, వేతన కార్యదర్శి పాలగాని పురుషోత్తం పాల్గొన్నారు.



## రైతన్నకు అండగా ఐక్యత సుంకిరెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు :** కల్వకుర్తి నియోజకవర్గంలోని రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆయన ఆమనగల్లు మండల పర్యటనలో భాగంగా మున్సిపాలిటీలోని విటాయిపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానంలో దాదాపు రెండు లక్షల రూపాయలతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా గుడికి రంగులు వేయించారు. దేవస్థానం ఆహ్వానం మేరకు ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమనగల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన నిట్ట పర్వతాలు అనే రైతు తన అంగ వైకల్యం వలన కుటుంబం గడవలేని పరిస్థితుల్లో జీవనాధరం కోసం రెండు పాడి ఆవులతో కుటుంబ జీవనం గడుపుతున్నారు. ఇటీవల పిడుగుపాటు వలన తన రెండు పాడి ఆవులను కోల్పోయి వారి జీవనం కష్టంగా మారింది. విషమం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఐక్యత ఫౌండేషన్ తరపున తక్షణ సహాయంగా రూ. 25,000 ఆర్థిక సహాయం చెక్ రూపకంగా అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. రైతన్నలకు ఆపదలో ఉన్నారంటే ఎలాంటి సహాయానికైన ముందుంటానని, ఐక్యత రైతు భరోసా పేరుతో మా ఫౌండేషన్ ద్వారా ఇప్పటి నుంచి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్నుంతల మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అండేకర్ రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు రాఘవేందర్, మల్లేష్ నాయక్, అభినవ్ రెడ్డి, కొండల్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.



## యాదయ్యకు కాంగ్రెస్ కార్యకర్తల సాయం

**విశ్వంభర, ఆమనగల్లు :** వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన సల్వాది యాదయ్య వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలిసి అజిలాపురం కాంగ్రెస్ కార్యకర్తలు మృతుడి కుటుంబానికి 29వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో అజిలాపురం గ్రామ ఎంపీటీసీ కేశముని మల్లేష్, అజిలాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్చమల్లయ్య, మామిడి తిరుపతయ్య, పెంట మీద నిరంజన్, పంచ మాసయ్య, వెంకటయ్య తదితరు పాల్గొని కుటుంబాన్ని ఓదార్చారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.








# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

- ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మంత్రుల చేత స్వీకారం చేయించనున్న ప్రొటెం స్పీకర్ భర్తిహరి మహతాబ్
- జూన్ 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం.. జూలై 2న లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగం..
- జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం లేకుండానే సమావేశాలు

**విశ్వంభర, ఢిల్లీ :** 18వ లోక్‌సభ తొలి సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 24 ఉదయం 11 గంటలకు లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా కొత్త ఎన్నికైన ఎంపీల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మొదట ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన కేబినెట్ మంత్రుల చేత ప్రొటెం స్పీకర్ భర్తిహరి మహతాబ్ ప్రమాణం చేయిస్తారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయిస్తారు. ప్రధాని మోదీ తర్వాత రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తర్వాత మంత్రి మండలిలోని ఇతర సభ్యులు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రధాని మోదీ కేబినెట్‌లో ఉన్న మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. కేంద్ర మంత్రి మండలిలోని 13 మంది సభ్యులు రాజ్యసభ ఎంపీలు, ఒక మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఏ సభలోను సభ్యులుగా లేరు. లోక్‌సభ ఎన్నికల్లో లూథియానా నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన బిట్టు ఓడిపోయారు. ప్రధాని మోదీ, ఆయన మంత్రుల తర్వాత ఆంగ్ల అక్షరమాల ప్రకారం రాష్ట్రాల వారీగా ఎంపీలతో ప్రమాణం చేయిస్తారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం ఉండదు.

### జూన్ 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

అదే విధంగా మొదట మొదటిరోజు అండమాన్ నికోబార్, ఏపీ, అరుణాచల్, అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎంపీల ప్రమాణం చేస్తారు. రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీల ప్రమాణస్వీకారం, చివరగా పశ్చిమ బెంగాల్ ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయను న్నారు. జూన్ 24న పార్లమెంట్ సమావేశాల తొలిరోజు కొత్తగా ఎన్నికైన 280 మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రెండో రోజు అంటే జూన్ 25న కొత్తగా ఎన్నికై న 264 మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఒక్కో ఎంపీ ప్రమాణస్వీకా రానికి ఒక నిమిషం సమయం కేటాయిస్తారు. ఆ తర్వాత 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరగనుంది. 27న ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ఇటీవలి నీట్ పేపర్ లీక్‌పై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించినప్పటికీ జూన్ 28న రాష్ట్రపతి ప్రసంగంపై చర్చిం చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

### జూలై 2న లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగం..

రాష్ట్రపతి ప్రసంగానికి ప్రతిస్పందనగా ప్రధాని నరేంద్ర మోదీ జూలై 2న లోక్‌సభలో ప్రసంగించనున్నారు. జూలై 3న రాజ్యసభలో మాట్లాడనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఒడిశాలోని కటక్‌కు చెందిన బీజేపీ ఎంపీ భర్త్రీహరి మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు జూన్ 20న తెలిపారు. స్పీకర్ ఎన్నిక జరిగే వరకు ప్రొటెం స్పీకర్‌కు సహాయంగా సురేష్ కోడికున్నిల్, తాళికోట్టై రాజుతేవర్ బాలు, రాధా మోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే, సుదీప్ బందోపాధ్యాయలను రాష్ట్రపతి నియమించారు. ఇదిలావుంటే, పార్లమెంటు దిగువ సభ అంటే లోక్‌సభలో బీజేపీకి స్పీకర్ పదవి లభించే అవకాశం ఉంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ఎన్‌డీఏ మిత్రపక్షాలలో ఒకరికి ఇవ్వవచ్చు. సాంప్రదాయకంగా ఎప్పుడూ ప్రతిపక్షానికి వెళ్లే డిప్యూటీ స్పీకర్ పదవిని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. అయితే 17వ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేరు. అయితే, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రెండూ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవికి అభ్యర్థుల పేర్లను ప్రకటించలేదు.

# నీట్ పరీక్షలపై స్పందించిన ఐఎంఏ

## పీఎం మోడీ, కేంద్ర మంత్రులకు బహిరంగ లేఖ



**విశ్వంభర, ఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అభినందించింది. నీట్ పరీక్షలు రద్దు చేసి తిరిగి నిర్వహించినందుకు దేశ ప్రధానితో సహా కేంద్ర మంత్రుల బృందానికి కృతజతలు తెలిపింది. దేశంలో తలెత్తిన నీట్ అండర్ గ్రాడ్యుయేషన్ పరీక్ష వివాదంపై సత్వరమే స్పందించి ఆ సమస్యను పరిష్కరించినందుకు ధన్యావాదాలు తెలిపింది. అందుకు సంబంధిత శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కూడా ఐఎంఏ అభినందించింది. నీట్ పరీక్షకు సంబంధించిన వివాదాన్ని తీవ్రతరం కాకుండా, ఆందోళనలను విరమించేందుకు దోహదపడే నిర్ణయాలు తీసుకున్నాందుకు ఒక లేఖలే సందేశాన్ని పంపించింది. అందులో కొన్ని కీలక విషయాలను పొందుపరిచింది. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు కోరుతూ సీబీఐని ఆదేశించినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖకు కృతజతలు తెలిపింది. ఇప్పటికే పాత ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌ను తొలగించి, కొత్త డైరెక్టర్ జనరల్‌గా శ్రీ ప్రదీప్ కుమార్ ఖరోకాకు అదనపు బాధ్యతను అప్పగించినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించింది. పోటీ పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కొనియాడింది. అందుకు సంబంధించిన చట్టాలు కూడా కఠినతరం చేయాలని కోరింది. ఇలాంటి పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి నేరస్తులుగా రుజువైతే గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రూ.కోటి జరిమాన విధించాలని సూచించింది. ప్రస్తుత విద్యార్థుల భారతదేశ భవిష్యత్తును పరిగణలోకి తీసుకుని ముఖ్యమైన పోటీ పరీక్షలను అత్యంత శ్రద్ధతో, గోప్యతతో నిర్వహించడం చాలా కీలకమని పేర్కొంది. ఐఎంఏ ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతించడమే కాకుండా, సమయానుకూలమైన వాటిపై తీసుకునే గొప్ప నిర్ణయాలను అభినందిస్తుందని ఈ లేఖలో పేర్కొంది. మెడికల్, డెంటల్ కోర్సులతో పాటు ఇతర కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ సకాలంలో ప్రారంభమయ్యేలా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నట్లు ఈ లేఖలో పొందుపరిచింది.

# మహిళా కానిస్టేబుల్‌తో ఎఫైర్..

- డీఎస్పీ నుంచి కానిస్టేబుల్‌గా డిమోట్
- మూడేళ్ల కింద హెూటల్‌లో దొరికిపోయిన డీఎస్పీ
- భార్య ఫిర్యాదుతో క్రమశిక్షణారాహిత్యం కింద కఠిన చర్యలు



**విశ్వంభర, ఉత్తరప్రదేశ్ :** మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న డీఎస్పీకి ఉత్తరప్రదేశ్ పోలీసులు షాకిచ్చారు. డీఎస్పీగా ఉన్న ఆయన్ను ఏకంగా కానిస్టేబుల్ స్థాయికి డిమోట్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో ఏకాంతంగా గడుపుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న మూడేళ్లకు ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కృపా శంకర్ కనౌజియా కానిస్టేబుల్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ డీఎస్పీ స్థాయికి ఎదిగాడు. 2021లో ఉన్నావ్‌లోని బిఘాపూర్‌లో సర్కిర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఆ సమయంలో కుటుంబ కారణాలు చెప్పి సెలవు పెట్టాడు. ఇంటికి వెళ్లడానికి బదులు ఓ మహిళా కానిస్టేబుల్‌తో కలిసి కాన్పూర్‌లోని హెూటల్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో వ్యక్తిగత, అధికారిక ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో భర్త ఇంటికి రాకపోవగా, ఫోన్లు కలవకపోవడంతో ఏం జరిగిందోనని భయపడిపోయిన అతడి భార్య ఎస్పీని ఆశ్రయించింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. అయితే ఫోన్ లొకేషన్ ఆధారంగా కాన్పూర్‌లోని ఓ హెూటల్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడికి చేరుకున్న మహిళా కానిస్టేబుల్‌తో కలిసి ఏకంతంగా ఉండటాన్ని చూసి పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు విచారణకు ఆదేశించారు. సీసీటీవీ ఫుటేజీతోపాటు ఇతర ఆధారాలు సేకరించిన అధికారులు అతడిపై క్రమశిక్షణారాహిత్యం కింద కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. ఇందులో భాగంగా డీఎస్పీగా ఉన్న అతడిని గోరఖ్‌పూర్‌లోని 26వ ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబులరీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా డిమోట్ చేశారు.



# సుప్రీంకోర్టును ఆశ్రయించిన సీఎం కేజ్రీవాల్

**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేయగా, ఆ బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా, ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సీఎం కేజ్రీవాల్ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని తన పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ ను అత్యవసర ప్రాతిపదికన రేపు (సోమవారం) విచారణ జరపాలని కేజ్రీవాల్ న్యాయవాదులు సుప్రీంకోర్టు రిజిస్ట్రీని కోరనున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీలాండరింగ్ అభియోగాలపై సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మార్చి 21న అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో జైలు నుంచి బయటికి వచ్చిన ఆయన... ఎన్నికలు ముగిశాక మళ్లీ జైలుకు వెళ్లారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆయనకు రూ.1 లక్ష పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయడంతో, కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి వస్తారని అందరూ భావించారు. అయితే, ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా... కేజ్రీవాల్ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించడంతో ఆయన విడుదలకు అవాంతరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే, కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# బీజేపీకి మాజీ కేంద్రమంత్రి సూర్యకాంత పాటిల్ రాజీనామా



**విశ్వంభర, బెంగళూరు :** లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైన కొద్ది రోజుల తర్వా త, కేంద్ర మాజీ మంత్రి సూర్యకాంత పాటిల్ భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 'గత 10 ఏళ్లలో నేను చాలా నేర్చుకున్నాను, పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఆమె రాజీనామా అనంతరం పేర్కొన్నారు. 2014లో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో విడిపోయిన తర్వాత బీజేపీలో చేరిన పాటిల్, లోక్‌సభ ఎన్నికల సమయంలో మరాఠ్వాడాలోని హింగో లి నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. అయితే, ఆమెకు టిక్కెట్ దక్కలేదు. నామినేషన్ వేయకపోవడంతో ఆమె సోషల్ మీడియాలో తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. సీట్ల షేరింగ్ సమయంలో హింగోలి సీటును ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు వదిలిపెట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ ఆమెకు హద్గావ్ హిమాయత్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గ పోల్ చీఫ్‌గా బాధ్యతలు అప్పగించింది. హింగోలి సీటును ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని వర్గం చేతిలో శివసేన కోల్పోయింది. కాగా, పాటిల్ హింగోలి-నాందేడ్ నియోజకవర్గానికి నాలుగుసార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆమె గ్రామీణాభివృద్ధి, పార్లమెం టరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు.

# మద్యం బాధితులకు కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : కమల్‌హాసన్



**విశ్వంభర, చెన్నై :** కల్తీమద్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని మక్కల్ నీది మయం (ఎంఎన్‌ఎం) అధినేత కమల్‌హాసన్ అన్నారు. ఆదివారం కళ్లకురిచ్చి కల్తీ మద్యం తాగి చికిత్స పొందుతున్న వారిని ఆయన పరామర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మద్యం తాగిన విషయంలో బాధితులు అజాగ్రత్తగా వహించారన్నారు. వారి ఆరోగ్యంపై అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం తాగిన వారు కూడా వారి స్థాయికి మంచి తాగారని వ్యాఖ్యానించారు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చే కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కల్తీ మద్యం విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, రాష్ట్రంలోని కళ్లకురిచి హూచ్ కల్తీ మద్యం తాగి చాలా మంది మృతి చెందారు. జూన్ 19న జరిగిన ఈ ఘటనలో ఆదివారం నాటికి మృతుల సంఖ్య 56కు చేరింది. అయితే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే నాలుగు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో ప్రమేయమున్న ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



# తన వారసుడిని ప్రకటించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి

- ఎన్నికల ముందు ఆకాశ్ ఆనంద్ ను రాజకీయ వారసుడి హెూదా నుంచి తప్పించిన మాయావతి
- అతడు ఇంకా పరిణతి సాధించాల్సి ఉందని నాడు వ్యాఖ్యలు
- లోక్ సభ ఎన్నికల్లో బీఎస్పీకి ఒక్క స్థానం కూడా దక్కని వైనం
- మళ్లీ మేనల్లుడికి పార్టీలో పట్టం కట్టిన బీఎస్పీ అధినేత్రి
- బీఎస్పీ జాతీయ సమన్వయకర్తగా నియామకం

**విశ్వంభర, లక్నో:** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జాతీయ అధ్యక్షురాలు మాయావతి తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ ను ప్రకటించారు. ఆకాశ్ ఆనంద్ తాజాగా బీఎస్పీ జాతీయ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మాయావతి వారసుడిగా ఆకాశ్ ఆనంద్ ఎంపిక వివరాలను బీఎస్పీ నేత సర్వర్ మాలిక్ వెల్లడించారు. ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో బీఎస్పీ ఒక్క స్థానం కూడా గెలవలేక చతికిలపడింది. ఈ నేపథ్యంలో, పార్టీ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాయవాతి నేడు లక్నోలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆకాశ్ ఆనంద్ సహా జాతీయ స్థాయి నేతలతో పాటు, అన్ని రాష్ట్రాలకు చెందిన బీఎస్పీ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ ను మాయావతి తన రాజకీయ వారసుడిగా ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఆమె ఓసారి అధికారికంగా ప్రకటించారు. అయితే, ఇటీవల ఎన్నికల ముందు అతడిని రెండు హెూదాల నుంచి తొలగించారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం అనే అంశాల ప్రాతిపదికగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తిగా తాను, కాన్షీరామ్ కలిసి పార్టీని ఏర్పాటు చేసి, అందుకోసం తమ జీవితాలను సైతం త్యాగం చేశామని మాయావతి ఎన్నికల ముందు పేర్కొన్నారు. ఈ దిశగా పార్టీ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ ను తన రాజకీయ వారసుడి హెూదా నుంచి, పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి తప్పిస్తున్నానని ప్రకటన చేశారు. అతడు పరిణతి సాధించే వరకు ఈ ప్రకటన వర్తిస్తుందని ఆమె వెల్లడించారు. రెండు వర్గాల మధ్య విద్వేషం పెంపొందిస్తున్నాడన్న ఆరోపణలతో పాటు, పలు ఇతర అభియోగాలతో ఆకాశ్ ఆనంద్ పై ఉత్తరప్రదేశ్ లోని సీతాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. దాంతో అతడిపై వేటు వేస్తూ మాయావతి నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఎస్పీ 424 మంది అభ్యర్థులను బరిలో దించింది. వారిలో ఒక్కరు కూడా గెలవలేదు. ఈ క్రమంలో... రెండు హెూదాల నుంచి తొలగించిన కొన్ని రోజులకే, మాయావతి తన మేనల్లుడికి అవే హెూదాలను తాజాగా తిరిగి కట్టబెట్టారు.

# అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ట చేసిన ప్రధాన పూజారి కన్నుమూత



**విశ్వంభర, వారణాసి :** ఈ ఏడాది ప్రారంభంలో అయోధ్య రామాలయంలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్(86) శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా ఆరోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం 6.30 గంటలకు నిద్రలేచి బాత్రూం వైపు నడుస్తుండగా స్పృహతప్పి పడిపోయాడని ఆయన కుమారుడు సునీల్ దీక్షిత్ తెలిపారు. అనంతరం 7 గంటల ప్రాంతంలో వారణాసిలోని తన నివాసంలో తుది శ్వాస విడిచినట్లు మీడియాకు వెల్లడించారు. వారణాసిలోని గాంగా నది తీరంలో ఉన్న మణికర్ణిక ఘాట్‌లో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ్‌లల్లాను ప్రతిష్టించిన విషయం తెలిసిందే. ఆ రోజున నిర్వహించిన పూజలకు ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన పూజారిగా వ్యవహరించారు. వారణాసిలో ఉన్న పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్‌ను అగ్రగణ్యులుగా పరిగణిస్తారు. ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ఎన్నో తరాలుగా వారణాసిలోనే నివసిస్తున్నారు.



# బాలిక మిస్సింగ్ కేసుపై పవన్ సీరియస్..

విశ్వంభర, విజయవాడ: పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా తన పనితనం ఏంటో చూపిస్తున్నారు. జనం కోసం నేను జనంలో నేను అంటు ప్రజల సమస్యలను ఐదు సంవత్సరాల కాలంలో తాను పరిష్కారం చేయాలనుకున్న కార్యక్రమాలపై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టారు. సినిమాలో తనకంటూ ఒక స్పెషల్ ఇమేజ్‌ని సంపదించుకున్న పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా దానిలో ప్రత్యేకత ఉండాల్సిందే అంటున్నారు. ఎమ్మెల్యే పదవి కోసం దశాబ్దాలుగా ఎదురు చూసిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కి డిప్యూటీ సీఎం పదవిలో వున్నారు. జనవాణి సభలో ప్రజల నుంచి వినతిపత్రాలను అందుకుని వాటిని పరిష్కరించడంలో దృష్టి పెట్టారు. అందులో భాగంగానే శివకుమారి తన కూతురు కనిపించడం లేదని పవన్ ను ఆశ్రయించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శివకుమారి డిప్యూటీ సీఎంకి ఫిర్యాదు చేసింది. విజయవాడలో చదువుకుంటున్న తన కుమార్తెను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేశారని పవన్ కల్యాణ్‌కి మొరపెట్టుకుంది. మాచవరం పోలీస్ స్టేషన్లో కంప్లైట్ చేసినా.. స్పందించడం లేదని మొరపెట్టుకుంది శివకుమారి. ఈ విషయంపై స్పందించిన పవన్ కల్యాణ్.. మైనర్ బాలిక ఎక్కడ ఉందో తెలుసుకోవాలిని తానే స్వయంగా మాచవరం సీఐకి ఫోన్ చేసి కేసు వివరాలను తెలుకున్నారు. బాలిక ఎక్కడ ఉందో తెలుసుకోవడం కోసం జనసేన నాయకులను ఇచ్చి బాధితులను మాచవరం పోలీసు స్టేషన్‌కు పంపించారు. వేంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలిక కోసం ఒక ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించామని పోలీసులు తెలిపారు.



# ఇంద్రకీలాద్రికి అమరావతి రైతుల పాదయాత్ర

విశ్వంభర, విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంత రైతులు విజయవాడ ఇంద్రకీలాద్రికి పాదయాత్ర చేపట్టారు. అమరావతి రూపశిల్పి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు రాజధాని ఉద్యమం విజయం సాధించడంతో కనకదుర్గమ్మ ఆలయానికి అమరావతి ఐకాస ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం తెల్లవారుజామున తుళ్లూరు శిబిరం నుంచి రైతులు, మహిళలు పొంగళ్లు తయారు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంద్రకీలాద్రికి కాలినడకన బయల్దేరారు. ఉదయం 11 గంటల లోపు అక్కడికి చేరుకుని మొక్కులు చెల్లించుకునేలా ప్రణాళిక రూపొందించారు. తుళ్లూరు నుంచి రాయపూడి, రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి, కరకట్ట, ప్రకాశం బ్యారేజీ మీదుగా పాదయాత్ర సాగనుంది. పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# ఈ మహిళా మంత్రులంతా ఒకప్పటి టీచర్లే.!



విశ్వంభర, విశాఖపట్నం : ఏపీలో టీచర్ గా పనిచేసి రాజకీయాల్లోకి వచ్చిన వారు ఏకంగా మంత్రులు అయిపోతున్నారు. ఇప్పుడు ఏపీ అంతట ఇదే ట్రెండ్ నడుస్తుంది.. తాజాగా హోం మంత్రి వంగలపూడి అనిత రాజకీయాల్లోకి రాకముందు ఉపాధ్యాయురాలుగా పని చేశారు. అలాగే మాజీ మంత్రి తానేటి వనిత కూడా ఎమ్మెల్యే కాకముందు కాలేజీలో లెక్చరర్ గా ఉద్యోగం చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి పీతల సుజాత సైతం ఉపాధ్యాయురాలుగా పని చేసినవారే. దాంతో టీచర్లందరూ ఏపీలో మంత్రులు అవుతున్నారనే టాక్ బాగా వినిపిస్తుంది. ప్రస్తుతం వంగలపూడి అనిత ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గ నుంచి టిడిపి తరఫున ఎమ్మెల్యేగా గెలుపొంది తాజా మంత్రివర్గంలో కీలకమైన హోం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. హోంమంత్రి అనిత 2009లో ఆంధ్ర యూనివర్సిటీ నుండి ఎంఏ, ఏంఈడి పూర్తి చేసి ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 28 సంవత్సరాలకే తన ఉద్యోగానికి రాజీనామా చేసి 2012 లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక ఐదేళ్లపాటు సుదీర్ఘంగా మంత్రిగా పనిచేసిన తానేటి వనిత ఒకప్పుడు ఉపాధ్యాయురాలే. తానేటి వనిత తండ్రి జొన్నకూటి బాబాజీ రావు గోపాలపురం మాజీ ఎమ్మెల్యే. 1995లో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ, ఎంఈడి పూర్తి చేశారు మాజీ మంత్రి వనిత. తరువాత నల్లజర్ల లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆమె లెక్చరర్ గా పని చేశారు. అయితే తండ్రి వారసత్వాన్ని స్వీకరించిన వనిత 2009లో టిడిపి నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి, వైసీపీ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. మరో మాజీ మంత్రి పీతల సుజాత సైతం ఉపాధ్యాయులుగా పనిచేశారు. 2004లో తండ్రి రాజకీయ వారసురాలిగా తొలిసారి ఆచంట నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో చింతలపూడి నుంచి గెలుపొంది చంద్రబాబు నాయుడి క్యాబినెట్‌లో స్త్రీ శిశు సంక్షేమ, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇలా ఒకప్పటి టీచర్లంతా అనంతరం మంత్రుల అవతారం ఎత్తడం ఆసక్తికరంగా మారింది. ఇక రాబోయే రోజుల్లో ఇంకెంత మంది ఉపాధ్యాయులు మంత్రులు అవుతారో చూడాలి మరి.

# జగన్‌పై మంత్రి లోకేశ్ సంచలన వ్యాఖ్యలు

- ప్రభుత్వ స్థలాల్లో వైసీపీ కార్యాలయాల నిర్మాణంపై ఆగ్రహం
- ఎక్స్ వేదికగా ఫొటోలు షేర్ చేసి మండిపాటు
- వాటిని కూల్చకుండా స్కూళ్లు, ఆస్పత్రులకు ఇవ్వాలంటున్న నెటిజన్లు





విశ్వంభర, మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై మంత్రి నారా లోకేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కార్యాలయాల నిర్మాణాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వివిధ జిల్లాల్లోని వైసీపీ కార్యాలయ భవనాల ఫొటోలను ట్వీట్ చూస్తూ నిప్పులు చెరిగారు. "జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నీ తాత రాజారెడ్డి జాగీరా! వైసీపీ కోసం 26 జిల్లాల్లో 42 ఎకరాలకు పైగా వెయ్యి రూపాయల నామ మాత్రపు లీజుకి 33 ఏళ్లకు కేటాయించుకున్నావు." అని పేర్కొన్నారు. అదేవిధంగా "జనం నుంచి దోచుకున్న రూ.500 కోట్లతో ప్యాలెస్‌లు కడుతున్నావ్. నీ ఒక్కడి భూదాహానికి కబ్జా అయిన రూ.600 కోట్లకు పైగా విలువైన 42 ఎకరాల్లో 4200 మంది పేద లకు సెంటు స్థలాలు ఇవ్వొచ్చు. నీ విలాసాల ప్యాలెస్‌ల నిర్మాణానికి అయ్యే 500 కోట్లతో 25వేల మంది పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వవచ్చు. ఏంటి ఈ ప్యాలెస్‌ల పిచ్చి? నీ ధన దాహానికి అంతులేదా?" అంటూ మండిప డ్డారు. అదేవిధంగా అనుమతులు లేకుండా నిర్మించిన ఈ వైసీపీ కార్యాలయాలను కూల్చొద్దని మంత్రి లోకేశ్‌కు నెటిజన్లు రిక్వెస్ట్ చేస్తున్నారు. అంత భారీ నిర్మాణాలను నేలమట్టం చేసేందుకు బదులుగా ప్రభుత్వ స్కూళ్లకు, ఆసుపత్రులకు ఇచ్చే అవకాశముంటే ఇవ్వాలని కోరుతు న్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు సంయుక్తంగా మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. మరి దీనిపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

# అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా వైద్య విద్యార్థిని



విశ్వంభర, ఏలూరు: అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ గా వైద్య విద్యార్థిని నియమిస్తున్నట్టు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి శనివారం చంద్రబాబు నాయుడిని కలిసింది. తమకు ఉన్న మూడు ఎకరాల పొలంలో ఎకరం అమ్మగా వచ్చిన రూ.25 లక్షలను, తన గాజులు అమ్మగా వచ్చిన రూ.లక్షను అమరావతికి, పోలవరం ప్రాజెక్టుకు విరాళంగా ఇచ్చింది. దాంతో చంద్రబాబు నాయుడు ఆమెను ప్రశంసించారు. ఒక డాక్టర్ చదివే అమ్మాయి ఇలా రాష్ట్రం కోసం ఆలోచించడం చాలా అభినందించదగ్గ విషయం అన్నారు. నేటి యువతకు వైష్ణవి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. యువకుల రాజధాని కలను నిజం చేసి చూపిస్తామన్నారు. ఇక రాజధాని, పోలవరం కోసం ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చిన వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ గా ప్రకటిస్తున్న ట్టు చంద్రబాబు నాయుడు తెలిపారు. వైష్ణవిని సీఎం శాలువా కప్పి సత్కరించారు. ప్రస్తుతం వైష్ణవి విజయవాడ లోని ఓ మెడికల్ కాలేజ్ లో ప్రస్తుతం ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమె తండ్రి అంబుల మనోజ్‌ను సీఎం అభినందించారు.

# త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**మంత్రి రాంప్రసాద్ రెడ్డి**




విశ్వంభర, అమరావతి : ఏపీలో టీడీపీ కూటమి ఇచ్చిన ఎన్నికల హామీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అనేది ప్రధానమైనది. దీనిపై రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అతి త్వరలోనే ప్రారంభిస్తామని, దీనిపై ప్రకటన ఉంటుందని తెలిపారు. పారదర్శక రీతిలో, ఎలాంటి సమస్యలు లేకుండా, ఎవరికీ కష్టం కలగకుండా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తున్నారని, అయితే అక్కడ తలెత్తిన లోటుపాట్లు ఏపీలో చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ, ఏపీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి వివరించారు. ఇక, మంత్రిగా తనకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్టు వెల్లడించారు. తాను చేపట్టిన శాఖలో తప్పులు జరగకుండా చూసేందుకు శక్తిమేర కృషి చేస్తానని చెప్పారు. మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇవాళ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

# అమెరికాలో బాపట్ల యువకుడిపై కాల్పులు



విశ్వంభర, బాపట్ల : అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చెలరేగింది. అర్కాన్సాస్‌లోని ఒక కిరాణా దుకాణంలో శుక్రవారం ఒక షూటర్ కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో నలుగురు మరణించగా.. మృతుల్లో తెలుగు యువకుడు కూడా ఉన్నాడు. ఇద్దరు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సహా మరో 9 మంది గాయపడ్డారు. మృతుడిని ఆంధ్రాలోని బాపట్ల జిల్లాకు చెందిన దాసరి గోపీకృష్ణ (32)గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కర్లపాలెం మండలం యాజలికి చెందిన దాసరి గోపీకృష్ణ జీవనోపాధి కోసం 8 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడి అర్కాన్సాస్‌లోని ఫోర్డైస్ అనే చిన్న పట్టణంలోని మ్యాడ్ బుట్చేర్ కిరాణా దుకాణంలో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం గోపీకృష్ణ కౌంటర్‌లో ఉండగా.. ఓ దుండగుడు నేరుగా వచ్చి తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రగాయాలతో గోపి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం దుండగుడు ఓ వస్తువు తీసుకుని అక్కడి నుంచి ఎస్కేప్ అ య్యాడు. ఆ తర్వాత గోపీకృష్ణను ఆస్పత్రికి తరలించగా.. పరి స్థితి విషమించి ఆదివారం చనిపోయాడు. ఈ సమాచారం తెలియడంతో అతడి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తు న్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మరోవైపు దుండగుడు కాల్పులు జరిపిన విజువల్స్ సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనుమానిత షూటర్‌ను న్యూ ఎడిన్ బర్గ్‌కు చెందిన 44 ఏళ్ల ట్రావిస్ యూజీన్ పోసీగా పోలీసులు గుర్తించారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో అతను కూడా గాయపడ్డాడు. అతని గాయాలు ప్రాణాంతకం కావని పోలీసులు తెలిపారు.



# నేడు పవన్ కల్యాణ్‌ను కలవనున్న టాలీవుడ్ నిర్మాతలు

విశ్వంభర, విజయవాడ : టాలీవుడ్ సినీ నిర్మాతలు నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలవనున్నారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలో ఈ భేటీ జరగనుంది. నిర్మాతలు అశ్వినీదత్, ఎస్.రాధాకృష్ణ (చినబాబు), యెర్నేని నవీన్, రవిశంకర్, డీవీవీ దానయ్య, భోగవల్లి ప్రసాద్, విశ్వప్రసాద్, నాగవంశీలతో పాటు తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శి దామోదర్ ప్రసాద్ తదితరులు విజయవాడ క్యాంపు ఆఫీసులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవనున్నారు. చిత్ర పరిశ్రమ సమస్యలను సినీ నిర్మాతలు పవన్ కల్యాణ్ కు వివరించనున్నారు. సినిమా టికెట్ల ధర పెంపు వెసులుబాటుపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. థియేటర్ల సమస్యలను కూడా నిర్మాతలు పవన్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.




# టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయలు

విశ్వంభర, నరసరావుపేట: టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును నియమించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎన్టీఆర్ భవన్‌లో శనివారం నిర్వహించిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ తొలిసారి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రీకృష్ణదేవరాయలు 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో నరసరావుపేట నుంచి వైసీపీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రాయపాటి సాంబశివరావుపై గెలుపొందారు. ఈ ఏడాది జనవరి 23న వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున నరసరావుపేట నుంచి మరోసారి పోటీ చేసి విజయాన్ని కైవసం చేసుకున్నారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు మంచి గౌరవం దక్కిందని, నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టులకు సంబంధించిన నిధులు, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టులనూ పూర్తి చేసేలా తీవ్రంగా కృషి చేస్తానన్నారు. తన కష్టాన్ని చూసి రెండోసారి గెలిపించిన పల్నాడు వాసులందరికీ రుణపడి ఉంటానన్నారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై సీఎంకు రిటైర్డ్ ఏఎస్పీ ఫిర్యాదు

విశ్వంభర, అనంతపురం : అనంతపురం అర్బన్ వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపై రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ బాలనరసింహారెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అనంత వెంకట్రామిరెడ్డి అక్రమాలపై విచారణ జరిపించాలని సీఎంను కోరారు. కేంద్రం నిధులను వెంకట్రామిరెడ్డి దుర్వినియోగం చేశారని, ఆస్తి పన్ను ఎగ్గొట్టారని తెలిపారు. సోదరులతో కలిసి వెంకట్రామిరెడ్డి అవినీతికి పాల్పడ్డారని బాలనరసింహారెడ్డి ఆరోపించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. కాగా, అనంత వెంకట్రామిరెడ్డి ఇటీవలి ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. టీడీపీ అభ్యర్థి దగ్గుటి ప్రసాద్ చేతిలో 23023 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

# గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న కరాటే కల్యాణి..



విశ్వంభర, విజయనగరం: కరాటే కల్యాణి గురిం చి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఆమె ఎప్పటికప్పుడు హిందువులు, గుడుల విషయం లో ఫైట్ చేస్తూ వార్తల్లో నిలుస్తుంది. ఇప్పుడు రాష్ట్రంలో చాలా మంది గోవుల అక్రమ రవాణా ను అడ్డుకుంటూ నిరసనలు తెలుపుతున్న విష యం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా కరాటే కల్యాణి కూడా ఇలాంటి పనే చేసింది. ఆమె విజయనగరం జిల్లా రగవరపుకోట నియో జకవర్గంలో పశువుల అక్రమ రవాణాను అడ్డు కుంది. స్థానిక నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నుండి కొత్తవలస అక్రమ తరలింపు స్టాక్ పా యింట్ వద్దకు జరుగుతోందని ఆరోపించారు. ఫేక్ నెబర్ ప్లేట్లు వేసిన వాహనాల్లో గోవులను తరలిస్తున్నారంటూ మండిపడ్డారు కరాటే కల్యాణి. గతంలో కూడా తాను 150 గోవులను కాపాడి పంపిస్తే ఇప్పుడు అవి అక్కడ లేవని తెలిపారు. ఇక గోవులను తరలిస్తున్న లారీకి అడ్డుగా కూర్చుని మరీ ఆమె నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఒక హోంగార్డును మాత్రమే అక్కడకు పంపినట్టు కరాటే కల్యాణి ఆగ్రహం తెలిపారు.

# అమ్మాయిలు అదరహో

- వన్డే టోర్నీలో భారీ విజయం
- దక్షిణాఫ్రికాపై భారత మహిళల జట్టు ఘన విజయం..
- సిరీస్ క్లీన్ స్వీప్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో భారత మహిళల జట్టు-దక్షిణాఫ్రికా మహిళల జట్టు మధ్య జరిగిన మూడో, చివరి వన్డేలో ఆతిథ్య టీమిండియా 6 వికెట్ల తేడాతో సులువైన విజయాన్ని నమోదు చేసుకుంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆఫ్రికన్ జట్టుపై టీమిండియా విజయం సాధించింది. దీంతో మరో గేమ్ మిగిలుండగానే సిరీస్ కైవసం చేసుకుంది. గత మ్యాచ్‌లో గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన.. సిరీస్‌లో దక్షిణాఫ్రికాను వైట్‌వాష్ చేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 215 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్ష్యాన్ని ఛేదించిన స్మృతి మంధాన 90 పరుగులు చేయడంతో టీమిండియా మరో 56 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది.

### భారత్‌కు సులువైన విజయం..

భారత జట్టు బౌలర్లు తక్కువ మొత్తానికి ఆఫ్రికా జట్టును చిత్తు చేస్తే.. పరుగుల వేటలో భారత జట్టు బ్యాట్స్‌మెన్ అద్భుతంగా ఆడారు. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ 61 పరుగులు జోడించారు. అనంతరం షెఫాలీ వర్మ 25 పరుగులు చేసి ఔటైంది. షెఫాలీ వర్మ ఔటైన తర్వాత స్మృతి మంధాన వేగంగా బ్యాటింగ్ కొనసాగించింది. అయితే, 83 బంతుల్లో 90 పరుగులు చేసి సెంచరీ లేకుండానే వెనుదిరిగింది. ఈ సిరీస్‌లో స్మృతి మంధాన మూడో సెంచరీ చేసేందుకు మంచి అవకాశం దక్కించుకుంది. కానీ, ఒక్క రాంగ్ షాట్ కారణంగా వికెట్ పడిపోయింది. స్మృతి మంధానతో పాటు, టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా అద్భుతమైన బ్యాటింగ్ చేసి 48 బంతుల్లో 42 పరుగులు చేసింది. 216 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 40.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి సులువుగా గెలిచింది.

# భారత జట్టులో లోపం అదే..

## ఆసీస్‌తో మ్యాచ్‌కు ముందు వీక్ పాయింట్ చెప్పేసిన హార్దిక్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** కెప్టెన్‌గా, వ్యక్తిగతంగా ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శనతో క్రికెట్ నిపుణుల నుంచి అభిమానుల వరకు అందరి చేత మాటలు పడిన ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో జట్టుకు అంచనాలకు మించి రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పాండ్యా అటు బ్యాట్, ఇటు బంతితో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో పాండ్యా ఆల్ రౌండర్ ఆటతో జట్టు విజేతగా నిలిచాడు. మొదట బ్యాటింగ్‌లో కేవలం 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 అద్భుతమైన సిక్సర్లతో 50 పరుగులతో అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో పాటు బౌలింగ్ లోనూ రాణించిన హార్దిక్ 3 ఓవర్లలో 32 పరుగులు చేసి ఒక వికెట్ తీశాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా గెలుచుకున్నాడు. మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన హార్దిక్ పాండ్యా.. సెమీ ఫైనల్‌కు ముందు టీమ్‌ఇండియా ఆందోళన ఏమిటో వెల్లడించాడు. జట్టు లోటు గురించి హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ.. జట్టుగా మనం చాలా రంగాల్లో మెరుగవ్వగలం. మనం వికెట్లు కోల్పోయే విధానాన్ని నిరంతరం మెరుగుపరుచుకోవాల్సి ఉందంటూ చెప్పుకొచ్చాడు. దీని వల్ల జట్టు మెరుగైన ప్రదర్శన చేయగలదు. మేం నిజంగా గొప్ప క్రికెట్ ఆడాం. వ్యక్తిగతంగా జట్టులోని ఆటగాళ్లంతా అద్భుత ప్రదర్శన చేశారు. తమ పనిని కూడా నీట్‌గా పూర్తి చేశామని తెలిపాడు. ఇక మ్యాచ్ గురించి చెప్పాలంటే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ 146 పరుగులకే పరిమితమైంది. దీంతో బంగ్లాదేశ్ జట్టు సెమీఫైనల్ కల చెదిరిపోయింది.

## టీమిండియాపై ఆసిస్ కెప్టెన్

# అనుచిత వ్యాఖ్యలు


## ఫ్యాన్స్ ఆగ్రహం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఆసిస్ జట్టు అహంకార పూరిత మాటలను మాత్రం వదలట్లేదు. ఇప్పటికే పలుమార్లు ఇండియా మీద ఇలాంటి కామెంట్లు చేసింది ఆసిస్ టీమ్. ఇప్పుడు తాజాగా ఆసిస్ టీమ్ కెప్టెన్ మిచెల్ మార్ష్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా తమ కంటే అన్ని విధాలుగా చిన్న జట్టు అయిన ఆఫ్గనిస్తాన్ తో ఆసిస్ జట్టు ఘోరాతి ఘోరంగా ఓడిపోయింది. 21 పరుగుల తేడాతో ఓడిపోవడంతో ఆసిస్ జట్టు మీద రకరకాల మీమ్స్ వైరల్ అవుతున్నాయి. అయితే మ్యాచ్ అనంతరం మిచెల్ మార్ష్ మాట్లాడుతూ.. ఈ రోజు ఆఫ్ఘనిస్తాన్ జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసి మమ్మల్ని ఓడించింది. పిచ్ పరిస్థితులను బట్టి ఏ జట్టు అయినా సరే టాస్ గెలిచాక ఫీల్డింగ్ ఎంచుకుంటాయి. ఈ రోజు మా ఇరువురి జట్లకు పిచ్ అనుకూలించింది. కాకపోతే ఓడిపోయాం. ఇక తర్వాత ఇండియాతో తప్పకుండా గెలుస్తాం. ఎందుకంటే మాకు గెలవడానికి ఇండియా కంటే మెరుగైన జట్టు మాకు దొరకదు. టీమ్ ఇండియాపై మేం గెలవాలని కోరుకుంటున్నా' అంటూ కామెంట్ చేశాడు. అయితే టీమ్ ఇండియా ఓడిపోయే టీమ్ అనే విధంగా ఆయన చేసిన కామెంట్ మీద ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రెజ్లర్ బజరంగ్ పునియాపై


# సస్పెన్షన్ వేటు



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ బజరంగ్ పునియాపై సస్పెన్షన్ వేటు పడింది. డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించాడనే ఆరోపణలతో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఆయనను సస్పెండ్ చేసింది. ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ బజరంగ్ పునియాపై సస్పెన్షన్ వేటు పడింది. డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించాడనే ఆరోపణలతో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఆయనను సస్పెండ్ చేసింది. ఈ మేరకు యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఉత్తర్వులు జారీ చేసింది. బజరంగ్ పూనియా గతంలోనూ పలుమార్లు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. మార్చి 10 న, ఎన్ఏడీఏ బజరంగ్ నుంచి నమూనాను డిమాండ్ చేసింది. అయితే బజరంగ్ యూరిన్ శాంపిల్ ఇవ్వడానికి నిరాకరించాడు. ఆ తరువాత ఒక అథ్లెట్ నమూనా ఇవ్వలేదని ఎన్ఏడీఏ ప్రపంచ డోపింగ్ నిరోధక ఏజెన్సీకి తెలిపింది. ఆ తర్వాత వాడా, నాడా మధ్య చాలా చర్చలు జరిగాయి. డబ్ల్యూడీఏ నోటీసు జారీ చేయాలని ఎన్ఏడీఏ కోరింది. బజరంగ్ పరీక్షకు ఎందుకు నిరాకరించాడో సమాధానం కోరుతూ నోటీసులు జారీ చేశారు. అయితే, బజరంగ్ డోపింగ్ ఇవ్వడానికి నిరాకరించలేదని తెలిపాడు. ఇదిలా ఉండగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా పోరాడిన రెజ్లర్‌లలో బజరంగ్ పూనియా కూడా ఉన్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని అప్పట్లో బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ పొగట్ తదితరులు ఆందోళనకు దిగారు.

## టీ20ల్లో గెలవాలంటే


# 50, 100లు అక్కర్లేదు : రోహిత్ శర్మ



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచ కప్‌లో భారత్ సెమీస్ దిశగా దూసుకెళ్తోంది. సూపర్-8లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సెమీస్ అవకాశాలకు మరింత దగ్గరగా వెళ్లింది. బంగ్లాదేశ్‌ను 50 పరుగుల తేడాతో చిత్తు చేసి గ్రూప్-1లో అగ్రస్థానంలోకి నిలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సంపూర్ణ ఆధిక్యంతో బంగ్లాను చిత్తు చేసింది. అయితే, ఈ విజయంపై కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'బ్యాటింగ్ చేసేటప్పుడు దూకుడు ప్రదర్శించడంపై ఇప్పటికే చాలాసార్లు చెప్పా. ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు ఇలా ఆడాల్సి ఉంటుంది. జట్టులో ప్రతీఒక్కరు అద్భుతంగా ఆడారు. పరిస్థితులకు త్వరగా అలవాటుపడి మంచి ప్రదర్శనను చూపారు. ఈ మ్యాచ్ జరుగుతున్న సమయంలో గాలి ప్రభావం ఎక్కువగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో స్మార్ట్‌గా ఆలోచించాం. ఎనిమిది మంది బ్యాటర్లు బరిలోకి దిగడం కూడా కలిసొచ్చింది. అందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు. జట్టులో ఒకరు హాఫ్ సెంచరీ చేయడంతో బంగ్లా ముందు 197 పరుగుల లక్ష్యం ఉంచగలిగాం. టీ20ల్లో ఎక్కువగా ఫిఫ్టీ(50)లు, సెంచరీ(100)లు అవసరం లేదనుకుంటా. ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకొస్తే పరుగులు సులువుగా వస్తాయి. జట్టులో ఎక్కువ అనుభవమున్న ప్లేయర్లే ఉన్నారు. పాండ్య బ్యాటింగ్‌లో మెరిస్తే మాదే పైచేయి అవుతుందని గత మ్యాచ్ సమయంలోనే వెల్లడించా. మిడిలార్డర్, లోయర్ ఆర్డర్‌తో కలిసి పరుగులు చేసే బాధ్యతను పాండ్య తీసుకున్నాడు. బౌలర్‌గానూ మాకు అత్యంత కీలకమైన ప్లేయర్. కుల్దీప్, బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు' అని రోహిత్ చెప్పుకొచ్చాడు.

## అంబానీ-అదానీ వంటి ప్రపంచ సంపన్నుల జాబితాలో

# రతన్ టాటా ఎందుకు లేదు?



**విశ్వంభర, బిజినెస్ :** టాటా గ్రూప్ వ్యాపార సామ్రాజ్యం మెటల్స్, మైనింగ్, ఐటీ, రిటైల్స్, ఆటోమెబైల్స్, హెూటళ్లు, రసాయనాలు, రవాణా, యుటిలిటీస్ వంటి రంగాల్లో విస్త రించి ఉంది. వారు కనీసం 29 లిస్టెడ్, అనేక అన్‌లిస్టెడ్ కంపెనీలను కలిగి ఉన్నారు. రతన్ టాటా భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన, గౌరవనీయమైన వ్యాపార దిగ్గజం. గొప్ప వ్యాపార చతురతతో పాటు, అతను తన దాతృత్వ కార్యకలాపాలు, మానవతా కార్యకలాపాల కారణంగా వ్యాపార ప్రపంచం లో అసాధారణమైన స్థానాన్ని సంపాదించుకు న్నారు. రతన్ టాటా 1990 నుండి 2012 వరకు టాటా గ్రూప్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. అతను అక్టోబర్ 2016 నుండి ఫిబ్రవరి 2017 వరకు ఈ గ్రూపుకు తాత్కాలిక ఛైర్మన్ గా కూడా ఉన్నారు. ఇప్పుడు అతను టాటా గ్రూప్‌లో ఎలాంటి పదవిని కలిగి లేదు. కానీ అతను గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు అధిపతి. కానీ, ఇప్పటికీ అతని పేరు ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో లేదు. భారతీయ కోటీశ్వరుల గురించి చర్చించినప్పుడు, ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ పేర్లు వస్తాయి. %××ఖీౖ% వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2022 ప్రకారం, భారతదేశంలోని అత్యంత సంపన్నుల జాబితాలో రతన్ టాటా 421వ స్థానంలో ఉన్నారు. ఆయన మొత్తం సంపద రూ.3,800 కోట్లు. 2021లో అతను ఈ జాబితాలో 433వ స్థానంలో ఉన్నారు. అప్పట్లో ఆయన నికర విలువ రూ.3,500 కోట్లు. ముఖేష్ అంబానీ లేదా గౌతమ్ అదానీతో ఎలాంటి పోలిక లేదు. వారి సంపద రూ.లక్షల కోట్లల్లో ఉంటుంది. అయితే, మార్చి 2022 నాటికి టాటా గ్రూపు మొత్తం మూలధనం రూ.23.6 లక్షల కోట్లు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో టాటా కంపెనీల ఉమ్మడి ఆదాయం రూ.9.6 లక్షల కోట్లు. అలాంటప్పుడు అంబానీ-అదానీలతో సంపద పోటీలో రతన్ టాటా ఎందుకు వెనుకబడి ఉన్నారు? నిజానికి, రతన్ టాటా సంపదలో ఎక్కువ భాగం 'టాటా సన్స్' నుంచి వచ్చింది. టాటా సన్స్ లాభాలలో ఎక్కువ భాగం టాటా ట్రస్ట్‌ల ద్వారా దాతృత్వానికి చేరుతుంది. టాటా సన్స్ లాభాల్లో 66 శాతం టాటా ట్రస్ట్‌లకు కేటాయించారు. ఈ ట్రస్ట్ ద్వారా టాటా గ్రూప్ విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, సాంస్కృతిక రంగాలలో నిధులను కేటాయిస్తుంది. ప్రధానంగా ఈ కారణంగా టాటాలు ఎప్పుడూ తమ స్వంత కంపెనీని కలిగి ఉండరు. టాటా సన్స్‌లో వారు సంపాదించే దానిలో ఎక్కువ భాగం టాటా ట్రస్ట్‌కు విరాళంగా అందిస్తున్నట్లు టాటా గ్రూప్‌లోని జామ్‌సెట్జీ టాటా స్వయంగా చెప్పారు. అందుకే సంపద విషయంలో అంబానీ-అదానీలను పోల్చినప్పుడు తక్కువే ఉన్నప్పటికీ రతన్ టాటా భారతీయుల హృదయాలను గెలుచుకున్నారు.

## రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఆదాయపు పన్ను

# పరిమితి పెరుగుతుందా?



**విశ్వంభర, బిజినెస్ :** రాబోయే యూనియన్ బడ్జెట్ 2024-25 పాత, కొత్త ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం.. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించడం, మధ్యతరగతి వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే కొన్ని మార్పులు కూడా తీసుకురావచ్చని అంటున్నారు. అంటే, ఊహించిన కొన్ని సర్దుబాట్లు పాత పాలనలో పన్ను స్లాబ్‌ల హేతుబద్ధీకరణను కలిగి ఉంటాయి. అలాగే, కొత్త పన్ను మినహాయింపు పరిమితులను పెంచడం కూడా ఇందులో ఉంది. రెండూ ఆర్థిక వృద్ధిని, వినియోగదారుల వ్యయాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇదిలా ఉండగా పాత ఆదాయపు పన్ను విధానంలో కొన్ని పన్ను శ్లాబులు హేతుబద్ధీకరించబడతాయని అంచనాలు ఉన్నాయి. అంటే కొత్త పన్ను మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచవచ్చు.

### ఎలాంటి మార్పులు రావచ్చు?

ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది. రూ.15 లక్షల కంటే ఎక్కువ జీతం పొందే వ్యక్తులకు పన్ను శ్లాబులను మార్చవచ్చని సమాచారం. ఎందుకంటే ప్రస్తుతం రూ.3 లక్షల నుంచి ప్రారంభమయ్యే ఆదాయానికి 5% నుంచి రూ. 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయానికి పన్ను 30% పెరుగుతుంది. ఈ సందర్భంలో ఏటా రూ. రూ. 10 లక్షలు సంపాదించే వారిపై పన్ను రేట్లలో తగ్గింపు, గరిష్ట పన్ను రేటు 30%పై కొత్త పరిమితిని యోచిస్తోంది. అలాగే, నివేదికల ప్రకారం, కొత్త ఆదాయపు పన్ను కింద మినహాయింపు పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. మధ్యతరగతి వినియోగాన్ని, దేశ జిడిపి వృద్ధిని మరింత ప్రోత్సహించడంలో భాగంగా కొన్ని వర్గాలకు చెందిన పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను ఉపశమనం కల్పించే ప్రయత్నాల మధ్య ఈ అభివృద్ధి జరిగింది.

### వ్యక్తిగత పెట్టుబడి, తగ్గింపులు

బడ్జెట్ 2020లో ప్రవేశపెట్టింది. వ్యక్తులు పాత పన్ను విధానంలో కొన్ని పెట్టుబడులు, తగ్గింపులతో తక్కువ పన్నులను అందించడం, సాధారణంగా చాలా తగ్గింపులు, మినహాయింపులు లేకుండా తక్కువ పన్ను రేట్లను అందించే కొత్త వ్యవస్థ మధ్య ఎంచుకోవచ్చు. ఇక్కడ పన్ను చెల్లింపుదారులు నిర్దిష్ట పెట్టుబడులకు తగ్గింపులు లేదా ఇంటి అద్దె భత్యం, సెలవు ప్రయాణ భత్యం వంటి తగ్గింపులను క్లెయిమ్ చేయవచ్చు. తదనంతరం ఎక్కువ మంది పన్ను చెల్లింపుదారులు కొత్త పాలనకు మారాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఇది తగ్గింపులు, రాయితీలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ప్రస్తుతం కొత్త పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ. 15 లక్షల కంటే ఎక్కువ ఉన్న వ్యక్తులు 30% అధిక పన్ను పరిధిలో ఉంచారు. అయితే, పాత పన్ను విధానం ప్రకారం, సంవత్సరానికి రూ. 10 లక్షల కంటే ఎక్కువ సంపాదించే వారికి ఇది వర్తిస్తుంది.




# రైలు ప్రయాణికులకు అలర్ట్..

## టికెట్ ఇలా బుక్ చేశారంటే అంతే..!!

- ఐఆర్‌సీటీసీ ఐడీపై ఇతరులకు టికెట్ బుక్ చేయొద్దు
- టికెట్ బుకింగ్‌లో కుటుంబసభ్యులకు మినహాయింపు
- నిబంధన అతిక్రమిస్తే 3ఏళ్లు జైలు, రూ.10వేలు జరిమానా

**విశ్వంభర, బిజినెస్ :** రైలు రిజర్వేషన్లపై కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. మీ ఐఆర్‌సీటీసీ అకౌంట్‌లో ఇతరులకు టికెట్ బుక్ చేస్తే ఇక నుంచి కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు. ఇది వరకు మీ ఐడీ నుంచి టికెట్ బుక్ చేసుకునే సదుపాయం ఉంది. ఇతరులకు సాయం చేయడానికి చాలా మంది ఇలా చేస్తుంటారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం అలా చేశారంటే ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది. వ్యక్తిగత ఐడీ నుంచి వేరే ప్రయాణికులకు ఆన్‌లైన్ టికెట్ బుక్ చేయడం నేరంగా ఐఆర్‌సీటీసీ పరిగణిస్తోంది. ఈ నిబంధనల ప్రకారం మీ ఖాతా నుంచి ఇతరులకు రిజర్వేషన్ టికెట్ బుక్ చేశారంటే 3ఏళ్లు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తారు. సెక్షన్ 143 రైల్వే చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ఏజెంట్లు మాత్రమే థర్డ్ పార్టీ టికెట్ పేరుపై టికెట్లు బుక్ చేయాలి. ఒకవేళ మీ ఐఆర్‌సీటీసీ అకౌంట్‌లో టికెట్ బుక్ చేస్తే మీ ఇంటి పేరు ఉన్న వారికి, రక్త సంబంధీకులు, కుటుంబసభ్యులకే చేయాలి. వేరే వ్యక్తులకు చేస్తే జరిమానా, జైలు శిక్ష, లేదా రెండూ ఒకేసారి విధించే అవకాశాలు ఉన్నాయి.

### రైలు రిజర్వేషన్ టికెట్ ఇలా బుక్ చేసుకోవాలి

ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ఓపెన్ చేసి మీ అకౌంట్‌లోకి లాగిన్ అవ్వాలి. బుక్ యువర్ టికెట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వెళ్లాల్సిన ప్రదేశం, ఎక్కడి నుంచి వెళ్తున్నారనేది ఎంపిక చేసుకుని ప్రయాణించే తేదీని నమోదు చేయాలి. స్లీపర్ క్లాస్ లేదా 3-ఏసీ ఎంపిక చేశాక ఏ రైలు అందుబాటులో ఉందో చూసుకోవాలి. బుక్ నౌ పై క్లిక్ చేసి ప్రయాణికుడి వివరాలు ఎంటర్ చేయాలి. మొబైల్ నంబర్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి. తత్కాల్ టికెట్ బుకింగ్ ఏసీ టికెట్ అయితే ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. నాన్ ఏసీ టికెట్ అయితే ఉదయం 11 గంటలకు బుకింగ్ ప్రారంభమవుతుంది.




# తండ్రి బాటలోనే తనయుడు.. స్టేజి ఫెర్ఫామెన్స్ అదరగొట్టిన గౌతమ్

## లండన్‌లో మహేశ్ బాబు ఫ్యామిలీ

## గౌతమ్ తొలి థియేటర్ స్టేజి పెర్ఫామెన్స్

## ఫొటోలు షేర్ చేసిన నమ్రత


టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు తనయుడు గౌతమ్ తన మొదటి స్టేజ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. లండన్ యూనికార్న్ థియేటర్‌లో గౌతమ్ తన పెర్ఫార్మెన్స్ ఇచ్చి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నాడు. ఈ పర్ఫామెన్స్ చూసేందుకు మహేశ్ ఫ్యామిలీ లండన్ చేరుకుంది. ఈ సందర్భంగా ఫ్యామిలీ మొత్తం కలిసి దిగిన ఫొటోలను ఆయన సతీమణి నమ్రతా శిరోద్కర్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'ఇదొక ప్రత్యేకమైన సాయంత్రం. గౌతమ్ ఘట్టమనేనిని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. లండన్ వేదికగా తన తొలి థియేటర్ స్టేజ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. చాలా బాగా అనిపించింది. లవ్ యూ మోర్ నాన్నా. చిన్నారులంతా ఈ సమ్మర్ ప్రోగ్రామ్లో పాల్గొని తమతమ టాలెంట్ ప్రపంచానికి పరిచయం చేసుకోవాలని ఆకాంక్షిస్తూన్నా. స్పెషల్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ మధ్య సంతోషంగా, హాయిగా అనిపించింది' అని నమ్రత పోస్ట్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గౌతమ్ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసే అవకాశాలు దగ్గర్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహేష్ బాబుతో కలిసి '1 నేనొక్కడినే' సినిమాలో గౌతమ్ చైల్డ్ ఆర్టిస్టుగా నటించాడు. ఆ తర్వాత పూర్తిగా చదువుపై దృష్టిపెట్టాడు. ఇటీవలే ప్లస్ టూ పూర్తి చేసిన గౌతమ్ యాక్టింగ్ కోర్సులు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక మహేశ్ గారాల పట్టి సితార కూడా సినిమాల్లోకి వచ్చేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే పలు ప్రకటనల్లోనూ మెరిసిందీ స్టార్ కిడ్. మొత్తానికి మహేష్ వారసులిద్దరూ సినిమాల్లోకి రావడం ఖాయంగానే కనిపిస్తోంది.

# పూజిత పొన్నాడ అందాల విందాట



విశ్వంభర, సినిమా : పూజిత పొన్నాడ ప్రధానంగా తెలుగు సినిమాలో పనిచేసే భారతీయ నటి. ఆమె ప్రధానంగా రంగస్థలం (2018) మరియు కల్కి (2019) చిత్రాలలో తన పాత్రలకు ప్రసిద్ది చెందింది. తాజాగా సోషల్ మీడియా వేదికగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.పూజిత పొన్నాడ ప్రధానంగా తెలుగు సినిమాలో పనిచేసే భారతీయ నటి. ఆమె ప్రధానంగా రంగస్థలం (2018) మరియు కల్కి (2019) చిత్రాలలో తన పాత్రలకు ప్రసిద్ది చెందింది. తాజాగా సోషల్ మీడియా వేదికగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.05 అక్టోబర్ 1989న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డెస్టినీ సిటీ విశాఖపట్నంలో జన్మించింది వయ్యారి భామ పూజిత పొన్నాడ. తమిళనాడులోని చెన్నైలోని SRM ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి B.Tech సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పట్టా పొందింది. పూజిత పొన్నాడ షార్ట్ ఫిల్మ్‌లతో నటన ప్రారంభించే ముందు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసింది. 2016లో నాగార్జున, కార్తీ మల్టీస్టారర్ చిత్రం ఊపిరిలో గేలరీ మేనేజర్ గా సినీరంగ ప్రవేశం చేసింది ఈ బ్యూటీ.2018లో రామ్ చరణ్, సమంత జంటగా నటించిన రంగస్థలం చిత్రంలో పద్మ అనే పాత్రలో ఆకట్టుకుంది అందాల తార పూజిత. తర్వాత రాజు గాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, 7, కల్కి, రన్, మిస్ ఇండియా, మనీషే,కథ కంచికి మనం ఇంటికి వంటి చిత్రాల్లో నటించింది.2022లో తెలుగు క్రైమ్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్ చిత్రంలో కీలక పాత్రలో మెప్పించింది ఈ వయ్యారి భామ. 2023లో రావణాసుర, జోరుగా హుషారుగా చిత్రాల్లో కనిపించింది. ప్రస్తుతం హరి హర వీర మల్లు సినిమాలో నటిస్తుంది.





# 'ప్రపంచంలో అందరికీ వయసొస్తోంది. అన్నయ్యకి తప్ప'

## మిస్టర్ బచ్చన్ షూట్‌లో రవితేజ ఫొటో షేర్ చేసిన హరీష్ శంకర్

## మాస్ మహారాజ ఫన్నీ రిప్లై

టాలీవుడ్ కమర్షియల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న హరీష్ శంకర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'షాక్' సినిమాతో దర్శకుడిగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలు చేస్తున్నాడు. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ హిట్ సినిమాలను అందించిన ఈ డైరెక్టర్ మాస్ మహారాజ్ రవితేజతో మూడు సినిమా తీసేందుకు సిద్ధమయ్యాడు. 'మిస్టర్' బచ్చన్ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమాకి సంబంధించి హరీష్ శంకర్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. సాంగ్ షూటింగ్‌లో రవితేజని ఫోటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ''ప్రపంచంలో అందరికీ వయసొస్తోంది. అన్నయ్యకి తప్ప. కాశ్మీర్ వ్యాలీలో షూటింగ్ జరుగుతుంది. త్వరలోనే హైదరాబాద్ లో దిగుతాము'' అని హరీష్ శంకర్ రాసుకొచ్చాడు. హరీష్ శంకర్ ట్వీట్ కి తాజాగా రవితేజ ఫన్నీ రిప్లై ఇచ్చాడు. ''ఓవర్ చేయకురోయ్.. నీ దిష్టే తగిలేలా ఉంది'' అని తన స్టైల్‌లో రిప్లై ఇచ్చాడు. దీంతో రవితేజ ట్వీట్ వైరల్ అవుతోంది. ఈ ట్వీట్ చూసిన రవితేజ ఫ్యాన్స్ వీళ్లిద్దరి బాండింగ్‌పై కామెంట్స్ చేస్తున్నారు. అజయ్ దేవగన్ 'రైడ్' మూవీకి రీమేక్‌గా తెరకెక్కుతున్న 'మిస్టర్ బచ్చన్' దసరాకు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## కల్కి సినిమా టికెట్ ధరల పెంపు..

# సర్కార్ గ్రీన్‌సిగ్నల్




ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన 'కల్కి 2898 ఏడీ' సినిమా టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు తెలంగాణ సర్కార్ అనుమతి ఇచ్చింది. ఈ నెల 27 నుంచి జులై 4 వరకు 8 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇటీవల టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు అనుమతి కోరుతూ వైజయంతీ మూవీస్ దరఖాస్తు చేసుకుంది. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 'కల్కి 2898 ఏడీ' చిత్ర టికెట్‌పై గరిష్ఠంగా రూ.200 పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 వరకు పెంచుకోవచ్చని తెలిపింది. దీంతో పాటు ఈ నెల 27న ఉదయం 5.30 గంటల షోకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వారం రోజుల పాటు ఐదు షోలు నిర్వహించేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేసింది.

# రోడ్డు పక్క నిలిపివేసి సేద తీరిన క్షణంలో



**విశ్వంభర, సినిమా :** పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఫుల్ ఫామ్ లో ఉన్నారు. పదేళ్ల కష్టం తర్వాత రాజకీయాల్లో సక్సెస్ అయి ఒకేసారి భారీ విజయం సాధించాడు. పవన్ గెలవడమే కాక జనసేన అభ్యర్థులందని గెలిపించాడు. ఇక ఏపీకి డిప్యూటీ సీఎం అయ్యాడు. మంత్రిగా కూడా పలు శాఖలు తీసుకున్నాడు పవన్. పవన్ ప్రస్తుతం ఏపీ రాజకీయాలతో బిజీగా ఉన్నాడు. పవన్ విజయం తర్వాత అకిరా నందన్, ఆద్య కూడా వైరల్ అవుతున్నారు. పవన్ గెలిచిన దగ్గర్నుంచి నాన్న పక్కనే ఉన్నాడు అకిరా. పవన్ ప్రమాణ స్వీకారం రోజు అకిరా, ఆద్య, మెగా ఫ్యామిలీ అంతా హాజరయ్యారు. అయితే ఆ రోజు పవన్ కళ్యాణ్, భార్య అన్న లేజనోవా, పవన్ పిల్లలు అకిరా నందన్, ఆద్య కలిసి దిగిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. జనసేన అధికారిక సోషల్ మీడియాలో ఈ ఫొటో షేర్ చేసి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేసిన తరవాత క్లిక్ అనిపించిన అందమైన ఫోటో ఇది. ప్రమాణ స్వీకారం చేసి మంగళగిరిలో నివాసానికి బయలుదేరాలనుకొంటే ట్రాఫిక్ చిక్కులు ఏర్పడ్డాయి. వాహనాన్ని రోడ్డు పక్క నిలిపివేసి సేద తీరిన క్షణంలో సతీమణి శ్రీమతి అనా కొణిదెల గారు, పిల్లలు అకీరా నందన్, ఆద్యలతో తీసుకున్న ఫోటో ఇది అని పోస్ట్ చేశారు. దీంతో ఈ ఫొటో వైరల్ గా మారింది. ఇక పవన్ అభిమానులు ఈ క్యూట్ ఫ్యామిలీ ఫొటో చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





# శరీరంలో ఈ ఆరు భాగాల నుంచి దుర్వాసన వస్తుందా..

**విశ్వంభర, ఫీచర్ :** వ్యాయామం, శారీరక శ్రమ, సూర్యరశ్మి ఇలా చెమట పట్టడానికి అనేక కారణాలున్నాయి. చెమటకు వాసన లేనప్పటికీ, అది చర్మంపై బ్యాక్టీరియాతో కలిసినప్పుడు అది తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. చెమట అందరికీ పడుతుంది కానీ కొంతమందికి మాత్రమే చెమట నుంచి దుర్వాసన వస్తుంది. కొందరికి ఎంత చెమట పట్టినా అది మరీ అంత అధ్వానంగా వాసన రాదు. ఆ చెమట కూడా బాగుంటుంది. ఎందుకంటే వాళ్ల శరీరంలో టాక్సిన్స్ ఎక్కువగా ఉండవు కాబట్టి.. ఇకపోతే.. ప్రత్యేకంగా శరీరంలో ఈ 6 భాగాల నుంచి దుర్వాసన వస్తుంది అంటే మీరు కాస్త జాగ్రత్తపడాలి..ఎందుకంటే..అవి సమస్యలకు సంకేతాలు లాంటివి.

**నోటి దుర్వాసన:**
కొన్నిసార్లు బ్రష్ చేసిన తర్వాత కూడా నోటి నుండి దుర్వాసన వస్తుంది. ఇది పీరియాంటల్ వ్యాధి, కడుపు సమస్యలు, మధుమేహం, మూత్రపిండ వ్యాధి లేదా శ్వాసకోశ సంక్రమణ లక్షణాలను సూచిస్తుంది.

**ముక్కు నుండి దుర్వాసన:**
చాలా సందర్భాలలో, నాసికా భాగాల నుంచి కూడా చెడు వాసన వస్తుంది. ఇది సైనస్ ఇన్ఫెక్షన్, పాలీప్స్ లేదా ముక్కులో ట్యూమర్లకు సంకేతం.

**చెవుల నుండి దుర్వాసన:**
విపరీతమైన దురద మరియు చెవుల నొప్పి వల్ల కూడా చెవుల నుండి దుర్వాసన రావచ్చు. ఇది చెవి ఇన్ఫెక్షన్, చెవిపోటులో రంధ్రం లేదా చెవి కణితి యొక్క సంకేతంగా చెప్పబడింది.

**చంకల నుంచి దుర్వాసన:**
చెమట వల్ల అండర్ ఆర్మ్ వాసన వస్తుంది. అయితే, అండర్ ఆర్మ్ నుండి వచ్చే అధిక వాసన తీవ్రమైన ఆరోగ్య సమస్యను సూచిస్తుంది. దీని నుండి బయటపడటానికి, మీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మరియు సరైన చికిత్స కోసం వైద్యుడిని సంప్రదించడం అవసరం.

**జననేంద్రియాలలో దుర్వాసన:**
మూత్రంలో కొంత దుర్వాసన రావడం సహజం. అయినప్పటికీ, జననేంద్రియాలలో చెడు వాసన అంతర్గత ఆరోగ్య సమస్యలను సూచిస్తుంది. ఇది UTI, మూత్రాశయం వాపు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యల హెచ్చరిక గంటగా కూడా ఉంటుంది.

**పాదాలలో దుర్వాసన:**
వేసవిలో బూట్లు ధరించడం లేదా వాటిపై తడి సాక్స్ ధరించడం వల్ల పాదాల దుర్వాసన వస్తుంది. అయినప్పటికీ, అధిక పాదాల వాసన బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్ యొక్క సంకేతం.

# పడుకునే ముందు మొబైల్‌ను ఎంత దూరంలో ఉంచాలి?



**విశ్వంభర, ఫీచర్ :** నిద్రపట్టేవరకూ మొబైల్ చూడటం.. నిద్రవస్తుంది అనుకున్నప్పుడు ఆ ఫోన్ అక్కడే దిండుకింద పెట్టుకోని పడుకోవడం చాలా మందికి అలవాటు. బెడ్‌మీదనే ఫోన్ పెట్టుకోని పడుకుంటారు. మీ ఈ అలవాటు మీకు చాలా ప్రమాదకరం. నిద్రపోతున్నప్పుడు మొబైల్ ఫోన్ మనకు ఎంత దూరంలో ఉండాలి. మీరు మీ మొబైల్ ఫోన్‌ను మీరు పడుకునే గదిలో మరొక మూలలో ఉంచవచ్చు. కానీ కొన్ని కారణాల వల్ల మీరు మీ మొబైల్ ఫోన్‌తో నిద్రించాలనుకుంటే, దానిని ఫ్లైట్ మోడ్‌లో ఉంచడం మర్చిపోవద్దు. అలాగే పొరపాటున కూడా ఫోన్‌ని దిండు దగ్గర పెట్టుకోవద్దు. ఫోన్ దిండు పక్కన పెట్టుకుని పడుకోవడం వల్ల జరిగే నష్టాలు ఇవే.. ఒత్తిడిని పెంచుతుంది : మీ ఫోన్‌ను మీ దిండు పక్కన పెట్టుకుని పడుకోవడం వల్ల మీ ఒత్తిడి స్థాయిలు పెరుగుతాయి. దీనితో పాటు మీకు ఉదయం తలనొప్పి కూడా రావచ్చు. మొబైల్ ఫోన్ల నుండి వచ్చే రేడియేషన్ మీ మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.నిద్రపై ప్రభావం : మీరు మీ ఫోన్‌ని ఎయిర్‌ప్లేన్ మోడ్‌లో ఉంచకపోతే, తరచుగా వచ్చే మెసేజ్ టోన్‌లు మీ నిద్రకు భంగం కలిగిస్తాయి. నిద్ర లేకపోవడం వల్ల మీరు ఉదయం అలసిపోయినట్లు అనిపించవచ్చు. మైగ్రేన్ సమస్య : రాత్రిపూట తల దగ్గర ఫోన్ పెట్టుకుని నిద్రపోవడం వల్ల మైగ్రేన్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మీరు రాత్రి పడుకునే ముందు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి. నిద్రపోయే ముందు ఫోన్ వాడటం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా లైట్స్ ఆఫ్ చేసి స్క్రీన్ లైట్ డైరెక్టుగా ముఖం మీద పడేలా ఫోన్ వాడితే.. కళ్ల కింద డార్క్ సర్కిల్స్ వస్తాయి. త్వరగా వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. నిద్రపట్టదు. నిద్రలేమి వల్ల ఇంకా అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయి. నిద్రపోయే ముందు ప్రశాంతంగా ఉండే పనులు చేయాలి. మాకు ఫోన్ చూడటమే ప్రశాంతంగా ఉంటుంది అంటే ఏం చేయలేం ఇక..!!

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com